

మంచినీళ్లివ్వాలంటే 54 పరీక్షలు చేయండి 7

నేటి నుంచి ఐదు చోట్ల టమోటాల విక్రయం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15 : బహిరంగ మార్కెట్లో టమోటా ధరలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ధరల నియంత్రణకు జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో టమోటా తగ్గలే శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ స్పందించారు.బహిరంగ ప్రదేశాల్లోనూ రైతు బజార్లలోని ధరలకే ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ మేరకు మార్కెటింగ్‌శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం నుంచి రాజమహేంద్రవరంలోని మల్లయ్యపేట, ఏవీ అప్పారావు రోడ్డు, ప్రకాష్‌నగర్, స్టేడియం రోడ్డు, బొమ్మూరు ప్రాంతాల్లో టమోటా విక్రయాలకు అవుట్‌లెట్స్ ఏర్పాటు చేస్తున్నామని జిల్లా మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకుడు ఎం.సునీల్ వినయ్ తెలిపారు. నగరంలోని ఐదు బహిరంగ ప్రదేశాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. బహిరంగ మార్కెట్లో ధరలు నియంత్రణలోకి వచ్చే వరకూ ఈ ప్రత్యేక కౌంటర్లు కొనసాగిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఎన్నికల్లో విజయం తర్వాత జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరి జనసేన కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యేలను సత్కరించారు.. దీనిలో భాగంగా జిల్లాలోని నిడదవోలు నియోజకవర్గం నుంచి ఎన్నికై మంత్రిగా ఉన్న కందుల దుర్గేష్, రాజానగరం నియోజకవర్గం నుంచి ఎన్నికైన బత్తుల బలరామకృష్ణలను సత్కరించారు.

మంత్రిగారి ఇలాఖాలో ఓకే..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో అపారిశుధ్యంపై "మంత్రిగారి ఇలాఖాలోనూ ఇంతే" శీర్షికన ఆంధ్రజ్యోతిలో గత శుక్రవారం ప్రచురితమైన కథమైన అధికారులు స్పందించారు.. శనివారం డీపీవో సమిశ్రగూడెం గ్రామాన్ని సందర్శించి పారిశుధ్యం మెరుగుపర్చాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా సోమవారం పంచాయతీ సిబ్బంది రంగంలోకి దిగారు..వేగంగా పనులు చేయిస్తున్నారు. ఈ మేరకు అమరావతి నుంచి మంత్రి కందుల దుర్గేష్ డ్రెయి నేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో కూడా సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. - నిడదవోలు





రూరల్ తహశీల్దార్ కార్యాలయం

ఈ నెల 4వరకూ పేరులేని అటెండెన్స్ రిజిష్టర్

ఇదేమి..వెంకటేశా!

- రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ
- డిప్యూటేషన్ లేకుండానే కలెక్టరేట్‌లో పని
- అటెండెన్స్ రిజిస్టర్‌లోనూ నమోదుకాని పేరు
- గత కలెక్టర్ వద్ద సీసీగా చెలాయింపు
- మాధవీలత బదిలీతో మాయం?

రాజమహేంద్రవరం రూరల్, జూలై 15 : ఆయన చెప్పిందే వేదం.. చేసిందే చట్టం..అడిగింది ఇవ్వాల్సిందే.. చెప్పింది చేయాల్సిందే.. ఇదెవరో ఉన్నతాధికారి గురించి కాదండోయ్.. గత కలెక్టర్ మాధవీలత వద్ద సీసీగా పని చేసిన ఒక ఉద్యోగి పెత్తనం.. అయితే కలెక్టర్ మాధవీలత బదిలీకావడంతో సదరు సీసీ ఖాళీ అయిపోయారు.. ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో.. ఏమైపోయారో తెలియదు. పరిపాలనా సౌలభ్యం కోసం కొంత మంది ఉద్యోగులను డిప్యుటేషన్‌పై మరొక చోటుకు పంపిస్తుంటారు. సంబంధిత ఉద్యోగి పేరెంట్ డిపార్టుమెంట్ ద్వారా జీత భత్యాలు తీసుకుంటాడు. అదంతా ప్రొసీజరు ప్రకారం జరుగుతుంది. అయితే ఇక్కడ మాత్రం అలాంటిదేమీ లేదు. రాజమహేంద్రవరం రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో వెంకటేష్ చాలా కాలం కిందట రెవెన్యూ అధికారిగా జాయిన్ అయ్యాడు. అయితే జాయిన్ అయిన రోజునే కార్యాలయానికి వచ్చాడు.. ఆ తరువాత నుంచి రాలేదు.. అప్పటి నుంచి కలెక్టరు మాధవీలత సీసీనంటూ చెబుతుండేవాడు. అయితే కార్యాలయానికి ఎటువంటి డిప్యుటేషన్ ఆర్డరు అందకపోవడంతో రూరల్ తహశీల్దార్ కార్యాలయ అధికారులు అయోమయానికి గురయ్యారు. కనీసం అటెండెన్స్ రిజిస్టరులో ఆ ఉద్యోగి పేరు కూడా నమోదు చేయలేదు. కాని జీతం మాత్రం ఈ కార్యాలయం నుంచే వెళుతోంది.ఎలాంటి అధికారి అయినా డిప్యుటేషన్‌పై మరొక కార్యాలయానికి వెళితే వారు జీతం తీసుకునే కార్యాలయంలో ఉండే అటెండెన్స్ రిజిస్టరులో ఆ ఉద్యోగి పేరు నమోదు చేసి డిప్యుటేషన్ వివరాలను రెడ్ మార్క్ చేస్తారు. అలాంటి రూల్స్ ఇక్కడ కనిపించవు.ఇదీ రాజమహేంద్రవరం రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయంలో పరిస్థితి.. ఆ ఉద్యోగి పేరు వెంకటేష్. హోదా ఆర్ఐ.. పనిచేసేది జిల్లా కలెక్టరేట్‌లో ఉన్నత స్థాయి అధికారి వద్ద సీసీనంటూ చక్రం తిప్పుతూ అధికారులను బెదిరిస్తూ కాలం వెళ్లబుచ్చుకుంటూ పలు అక్రమాలకు పాల్పడ్డాడంటూ పలువురు అధికారులు చెబుతున్నారు. ఏపని కోసమైనా గత కలెక్టరు మాధవీలతను కలవాలంటే ఈ అనధికార సీసీని ప్రసన్న చేసుకోవాల్సి వచ్చేదని పలువురు జిల్లా అధికారులు చెప్పడం గమనార్హం.

అన్నీ తానై..?

రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ లేకపోవడంతో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ అంతా తానై వ్యవహరించినట్టు సమాచారం. ధవళేశ్వరం గ్రామ వీఆర్‌వో సహాయంతో ఆర్ఐ విధులు నిర్వహించేవారని తెలిసింది. మండల పరిధిలోని అన్నిరకాల రెవెన్యూ సర్వీసులు, ముఖ్యంగా ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్లు మొదలు, భూములకు సంబంధించి మ్యుటేషన్స్ వరకు తానొక్కడే చేస్తూ గ్రామ వీఆర్‌వోలను ఆదేశిస్తూ పలు భూరికార్డులను టాంపరింగ్ చేయడంతో పాటు పలువురికి లబ్ధి చేకూర్చారంటూ ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారమంతా గత కలెక్టరేట్ వద్ద సీసీగా విధులు నిర్వహించిన వెంకటేష్ మేనేజ్ చేస్తుండేవాడని సమాచారం. దీనిపై తహశీ ల్దార్‌ను వివరణ కోరగా గత కలెక్టర్ మాధవీలత బదిలీ కావడంతో ఈ నెల 5వ తేదీన ఆఫీస్‌కు వచ్చి లీవ్ లెటర్ ఇచ్చి వెళ్లినట్టు చెప్పారు.



మాయాషాఢం!



ఆషాఢం..ఆఫర్ల వల



90 శాతం.. 80 శాతం..70 శాతం..60 శాతం.. ఫ్లాట్ డిస్కౌంట్.. చివరకు ఎంత కొంటే అంత ఉచితం.. జిల్లా వ్యాప్తంగా వస్త్ర దుకాణాల వద్ద ప్రస్తుతం కనిపిస్తున్న బోర్డులివి.. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో ఇది మరికాస్త ఎక్కువ.. ఎందుకంటే ఒకటా రెండా సుమారుగా వెయ్యి వస్త్ర దుకాణాలు ఉంటాయి.. భలే ఉందిలే ఆఫర్ అని షాపులో అడుగుపెట్టామా ఇక అంతే సంగతి.. అవగాహన లేకపోతే జేబు ఖాళీయే.. ఆషాఢం ముసుగులో సాగే మోసం అంతా ఇంతా కాదు..

ఎవరైనా రూ.100కి కొని రూ.40కి విక్రయిస్తారా? కచ్చితంగా జరగదు. మరి ఈ డిస్కౌంట్ల మేళా ఏమిటి? అంటే అదో పెద్ద మోళీ. వినియోగదారులను దుకాణంలోకి రప్పించడమే లక్ష్యంగా డిస్కౌంటు బోర్డులు తగిలిస్తారు. లోపలకు వెళ్లాక డిస్కౌంటు ధరల వస్త్రాలు చూస్తే నీరసమొస్తుంది. పెద్దగా బాగోనివి, సేల్స్ లేని ఐటమ్స్, డ్యామేజీలు ఉన్నవి, పాత స్టాకు గుట్టలుగా పోస్తారు. డిస్కౌంటుకు ఆశపడి వెళ్లిన వారిలో సుమారు 90శాతం మందికి ఇవి నచ్చవు. వెంటనే పక్కనే ఉన్న వస్త్రాలను చూస్తారు. వాటికి ఒక్క రూపాయి డిస్కౌంటు కూడా ఇవ్వరు. మరో షాపునకు వెళ్లినా ఇదే తతంగం కావడంతో డిస్కౌంటు కోసం వెళ్లిన వాళ్లు ఏ డిస్కౌంటూ లేని దుస్తులను కొనక తప్పదు. ఇదే అదనుగా వీటి ధరలపై బాదుడే.. బాదుడు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఆషాఢం వచ్చిందంటే మోళీ మొదలైపోతోంది. ఎడాపెడా ఎడతెరిపి లేని రాయితీలే. ఓ రూపాయి మిగులుతుందనే అమాయక జనం ఆశను ఆసరాగా చేసుకొని దగా చేయడం పరిపాటిగా మారిపోయింది. ఉభయగోదావరి జిల్లాలకు రాజమహేంద్రవరమే అతి పెద్ద మార్కెట్. ఇక్కడ సుమారు వెయ్యి వరకూ చిన్నా పెద్దా వస్త్ర దుకాణాలు ఉంటాయి. వీటిలో 20 వరకూ పెద్ద పెద్ద మాల్స్ 50 వరకూ భారీ దుకాణాలు ఉన్నాయి. ఏ సీజన్ అయినా ప్రతి రోజూ కోట్లలో వ్యాపారం సాగుతోంది. అయితే అషాఢం సీజన్‌లో ఇది మరింత ఎక్కువ ఉంటుంది. ఎందుకంటే చీరకు కారు ఫ్రీ అన్న డైలాగు విన్నారా?.. అలాగే ఏకంగా 80 శాతం రాయితీ కూడా ఇచ్చేస్తున్నామంటూ వ్యాపారులు ప్రచారాలతో ఊదరగొడుతున్నారు. గతంలో ఈ మోసంలో కూడా కాస్త నిజాయితీ ఉండేది. డ్యామేజీ అయినవి, పాత స్టాకు వంటి వాటిని ఆషాఢం ధమాకా పేరుతో రేటు తగ్గించి వదిలించుకునేవారు.కానీ కొన్నేళ్లుగా ప్లాట్‌ఫాంపై సరుకు కూడా మిరుమిట్లు గొలిపే లైటింగ్ మధ్య అద్దాల దుకాణాల్లో దర్శనమిస్తోంది. సందట్లో సడేమియా మాదిరిగా పెద్ద బ్రాండ్ల పేరుతో నకిలీలను అంటగడుతున్నారు.కిలోల తూకం అంటూ టన్నుల్లో మోసగిస్తున్నారు. అయితే మరో ఆషాఢం రాకుండానే వాటి మన్నిక వెక్కిరిస్తోంది. కానీ, 'డిస్కౌంట్' మాట చెవిన పడగానే జనం ఎగబడడం మాత్రం సాధారణంగా మారిపోయింది. ఈ మోసపు వేషాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

నాడు క్లియరెన్స్..నేడు డిస్కౌంట్

ఆషాఢమాసం వచ్చిందంటే 'ఆషాఢం డిస్కౌంట్ సేల్' అనే బోర్డులు దాదాపు అన్ని దుకాణాల వద్ద చూస్తుంటాం. ఆషాఢంలో దుకాణాల్లో పెద్దగా వ్యాపారాలు సాగవు. దీంతో బేరాలు పెరగడానికి డిస్కౌంట్లు పెడుతుంటారు. అదే ప్రస్తుతం వ్యాపారులకు కలిసొచ్చింది. కొనేళ్ల కిందట డిస్కౌంట్లు కాస్త సహేతుకంగా సాగేవి. ఆషాఢంలో పాత స్టాకును క్లియర్ చేసుకునేవారు. కానీ రాను రాను ఆషాడం సేల్స్ అంటే మోసానికి నిదర్శనంగా మారిపోయింది.అసలు ధరలను ఇష్టానుసారం వేస్తూ తగ్గింపును భారీగా చూపించి ప్లాట్‌ఫాం సరుకు పెద్ద దుకాణాల్లో విక్రయిస్తున్నారు.పేద, మధ్య తరగతి జీవులు డిస్కౌంట్‌ను ఎక్కు వగా కోరుకుంటారు. ఇదే అదనుగా దుకాణాలూ మోసాలకు ఆషాఢాన్ని ఎంచుకు న్నాయి. క్లియరెన్స్ సేల్..డిస్కౌంట్ ధమాకాగా మారిపోయింది.

అసలు ధర ఎంతబ్బా?

వస్త్రాలు, చెప్పులు, బూట్లు వంటి వాటి అసలు ధరలు చెప్పడం ఎవరి తరమూ కాదు. వ్యాపారులు ఎంతకు హోల్‌సేల్‌గా కొంటున్నారో.. వాటికి రవాణా తదితర ఖర్చులతో కలిపి ధర ఎంత నిర్ణయించాలో అనే సహేతుకత లేదు ధరల నిర్ణయం, తనిఖీల్లో ప్రభుత్వ యంత్రాంగం పాత్ర అంతంత మాత్రమే. దీంతో ధరలను ఇష్టానుసారం వేస్తుంటారు. ఉదాహరణకు ఒక చీర ధర రూ.5 వేలు చూపించి 60 శాతం డిస్కౌంట్ అంటూ రూ.3 వేలు మినహాయించామని, రూ.2 వేలకే రూ.5 వేల విలువ చేసే చీర ఉదారంగా ఇస్తున్నామంటారు.కానీ అసలు ఆ చీర ఖరీదు రూ.5 వేలు ఉంటుందా? అంత విలువ చేస్తుందా? అనే విషయాలకు ఎవరూ సమాధా నం చెప్పలేరు.రూ.200 చీర ధర రూ.5 వేలు అన్నా ఏం చేయలేం.వాస్తవానికి ఎంఆర్పీ అంటే గరిష్ఠ చిల్లర ధర. వ్యాపారులు దీనిని చూపించి తగ్గించడం కుదరదంటూ బురిడీ కొట్టిస్తారు.ఎంఆర్పీపై బేరమాడే వెసులుబాటు వినియోగదారుడికి ఉంది.ఎంఆర్పీపై తగ్గింపును కోరవచ్చు.

విచక్షణే ఆయుధం

డిస్కౌంట్ల మోళీలో చిక్కుకొని పేద, మధ్య తరగతి ప్రజానీకం ఎక్కువగా మోసపోతున్నారు. ధరల నిర్ణయంలో సహేతుకత లేకపోవడం.. విధివిధానాలు అసలే ఉండకపోవడం మోసానికి కొమ్ముకాస్తున్నాయి. ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొడుతున్నా.. ఆన్‌లైన్ పేమెం ట్లు ప్రోత్సహించకుండా నగదు తీసుకుంటూ నల్లధనానికి ఊతమిస్తున్నా అధికారులకు పట్టదు. ఇక ధరల నియంత్రణ ఊసే లేదు. ఈ దుస్థితిలో వినియోగదారులే తమ విచక్షణకు పదును పెట్టాల్సి ఉంది. ఆషాఢం సేల్ వచ్చేసిందంటూ పరుగులు పెట్టకుండా వస్తువుల మన్నిక, డబ్బుకు తగిన సరుకు వస్తుందా! అనే విషయాలను గమనించుకోవాలి. డిస్కౌంట్‌లో అతి తక్కువ ధరకే వచ్చిందని సంబరపడితే కొద్ది రోజుల్లో చీకిపోవడం, చిరిగిపోవడం, రంగి వెలిసిపోవడం జరుగుతుంటాయి.ఒక్క ఉతుక్కే పనికి రాకుండా పోతాయి. అప్పుడు డబ్బులు అనవసరంగా పోగొట్టుకున్నామన్న వేదనే మిగులుతుంది.బ్రాండ్ల పేరుతోనూ బురిడీ కొట్టిస్తున్నారు. ప్రముఖ కంపెనీ వస్త్రాలు, బ్యాగులు, బూట్లు, చెప్పులు, హ్యాండు బ్యాగులు, డోర్ మ్యాట్‌లు అంటూ జనాలను మోసగిస్తున్నారు. ఓ ప్రముఖ కంపెనీ ఎంబ్లమ్(చిహ్నం)తో ఉండే టాప్‌లు, హ్యాండ్‌బ్యాగ్, షూ వంటి వాటిపై వేలల్లో ఎంఆర్పీ పెడుతున్నారు. ఏకంగా 70 శాతం డిస్కౌంట్ ధరకే ఇస్తున్నామని మోసగిస్తున్నారు.ఉదాహరణకు ఒక బ్రాండెడ్ షూ ధర రూ.10 వేలు ఎంఆర్పీ చూపించి 70 శాతం డిస్కౌంట్ అంటున్నారు. అంటే రూ.3 వేలకే బ్రాండెడ్ షూ వస్తుందని వినియోగదారుడు ఆశ పడుతున్నాడు. కానీ అది నకిలీ అని తెలుసుకోలేకపోతున్నారు. వాస్తవానికి ఆ షూ ధర రూ.500 ఉండకపోవచ్చు. అసలు బ్రాండెడ్ వస్తువులకు 60, 70, 80 శాతం డిస్కౌంట్ ఇస్తారా? అనే ఆలోచన జనాల్లో ఏమైందనేది ఓ పెద్ద ప్రశ్నగానే ఉంటోంది. మనకు రూ.2 వేలకు ఇస్తున్నారంటే వ్యాపారులకు హోల్‌సేల్‌గా ఎంత ధరకు వచ్చి ఉండాలి. దానికి లాభం, రవాణా, సిబ్బంది జీతాలు, వసతి, అద్దెలు వంటివి కలిపితే ఎంత అవుతుంది?.. ఇలా ఒక్కసారి లెక్కవేసి చూడండి.. మోళీ మీకే తెలిసిపోతుంది. అతి చిన్న తేడాలతో అసలైన బ్రాండకు అతి దగ్గరగా ఎంబ్లమ్‌లను ప్రింట్ చేస్తుండడంతో వినియోగదారులు పసిగట్టలేకపోతున్నారు. సెల్‌ఫోన్‌లో సెర్చ్ చేసి నకిలీకి, అసలుకు తేడా తెలుసుకోవచ్చు. కానీ నకిలీని కూడా వేల రూపాయలు పెట్టి కొంటున్నారు. ఎంఆర్పీపై డిస్కౌంట్ ఎంత ఇస్తున్నారని చూసి మురిసిపోయే ముందు అసలు ఆ వస్తువు విలువకు ఎంఆర్పీ ధరకు పొంతన కుదురుతుందా అనే విషయాన్ని పరిశీలించడం బెటర్.

- మార్కెట్‌లో డిస్కౌంట్ల మేళా
- ఒకటి కొంటే ఒకటి ఉచితం
- చీరలు ఒక కిలో రూ.వెయ్యి
- ఎంత కొంటే అంత ఫ్రీ
- ఎగబడుతున్న జనం
- మోసపోతున్న వైనం
- పట్టని అధికార గణం
- రాజమండ్రిలో భారీగా షాపులు
- గోదావరి జిల్లాలకు మార్కెట్
- రోజూ కోట్లలో వ్యాపారం





ముత్యాలమ్మకు.. బంగారం నిలువు దోపిడీ

చాగల్లు, జూలై 15: కోరిన కోర్కెలు తీర్చడంతో మండలంలోని నెలటూరు గ్రామదేవత శ్రీముత్యాలమ్మకు ఒక మత్తయిదువ బంగారం నిలువు దోపిడీ సమర్పించుకుంది. సుమారు పదకొండున్నర కాసుల బంగారు ఆభరణాలు, 46 గ్రాముల వెండి ఆభరణాలు కరిగించి కనికలుగా మార్చి అమ్మవారికి సమర్పించారు. ఇదిలా ఉండగా భక్తులు ఆషాఢ మాస సారె కావిళ్ల సమర్పించి ముత్తయిదువులు మొక్కులు చెల్లించుకున్నారు. పలు రకాల తీపి పదార్థాలను గ్రామస్తులు సోమవారం కావిళ్లతో సారెగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. బాణసంచా కాలుస్తూ, డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, 300 మంది ముత్తయిదువులు పాల్గొన్నారు.

ఇసుకా లేదు.. ఉచిత విద్య లేదు..

- జనంతో కిటకిటలాడిన కలెక్టరేట్
- సమస్యల పరిష్కార వేదికకు హాజరు
- 121 అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- పలు సమస్యలపై విన్నపాలు



మీ సమస్యలన్నీ పరిష్కరిస్తా : అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై 15 : ఇసుక సరఫరాకు ఇబ్బందులు తప్పడంలేదని పలువురు కలెక్టర్ ఎదుట వాపోయారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక అర్జీదారులతో కిటకిటలాడింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఇన్‌చార్జి జేసీ దినేష్ కుమార్, డీఆర్‌వో నరసింహులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురు లారీ ఓనర్ కం డ్రైవర్లు కలెక్టర్‌ను కలిసి ఇసుక ట్రాన్స్‌పోర్టులో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. ఇసుక కావాల్సిన వినియోగదారుల ప్లాన్ అప్రూవల్స్, ఆధార్ కార్డులు తీసుకుని పంచాయతీ కార్యదర్శుల వద్దకు వెళుతుంటే వారు వాటిని ధ్రువీకరించడానికి పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదన్నారు.సమస్యను పరిష్కరించాలని కోరారు. చాలా మంది దివ్యాంగులు తమ అంగ వైకల్యం 80 నుంచి 90 శాతం ఉందని.. ప్రస్తుతం ఇస్తున్న పింఛను రూ.15 వేలకు మార్పుచేయాలని కోరారు. విద్యాహక్కు చట్టం కింద కార్పొరేట్ స్కూల్స్‌లో 25 శాతం సీట్లు ఉచితంగా పేద,మధ్య తరగతి కుటుంబాలకు ఇవ్వాలని..కానీ రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో పలు కార్పొరేట్ స్కూల్స్‌లో ఉచిత సీట్ల కేటాయింపుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫ్రీ ఎడ్యుకేషన్ స్టూడెంట్స్, పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో కొంత మంది తల్లిదండ్రులు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. శ్రీగౌతమి పాఠశాలలో 34 మందికి సీట్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం ఆరుగురికి మాత్రమే సీట్లు ఇచ్చి మిగిలిన వారికి నిరాకరించారన్నారు. ధవళేశ్వరంలోని ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ సంఘ సభ్యులు ప్రమోద్ కుమార్, పాస్టర్ జికిరణ్ బాబు తదితరులు కలెక్టర్‌ను కలిసి తమ చర్చిలో పరిస్థితిని చక్కదిద్దాలని విజ్ఞప్తి చేశారు. ధవళేశ్వరం ఎర్రకొండకు చెందిన తల్లాడ ఉమ తన కుమారుడు సాయికుమార్ 2019 నుంచి కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు పట్టించుకోలేదని అర్జీ పెట్టారు.ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మొత్తం 121 అర్జీల ను కలెక్టర్ స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహిం చిన గ్రీవెన్స్‌కి 21 ఫిర్యాదులు అందాయి. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్ రాజు ఫిర్యాదుదా రులతో మాట్లాడి సమస్యలను తెలుసు కున్నారు.కార్యక్రమంలో టూరిజం జేడీ వి.స్వామినాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు టి.రాధిక,ఆర్‌డీవో కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15 : గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో సోమవారం గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ (పీసీ పీఎన్ డీటీ యాక్టు) అమలుపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, వివరాలు కోరినా శిక్షార్హులేనని హెచ్చరించారు. జిల్లాలో స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై ఆకస్మిక తనిఖీలు చేసే విధంగా నిఘా వ్యవస్థ పెంచాలన్నారు. జిల్లాలో లింగ నిష్పత్తి సంఖ్య 800 కంటే తక్కువగా ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను సందర్శించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ ఏడాది జరిగిన ప్రసవాల లింగ నిష్పత్తి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, వైద్యాధికారులుపాల్గొన్నారు.

విమానాశ్రయ పరిరక్షణకు చర్యలు చేపట్టండి

ఎయిర్‌ఫీల్డ్ పర్యావరణ నిర్వహణ కమిటీ సమావేశంలో కలెక్టర్

రాజమహేంద్రవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం విమానాశ్రయంలోని ఫ్లయింగ్ జోన్‌లో పక్షులు, కోతులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ఎయిర్‌ఫీల్డ్ పర్యావరణ నిర్వహణ కమిటీ సమావేశంలో మాట్లాడారు. విమానాశ్రయంలో వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు రెండు ప్రతిపాదనలు సిద్ధం చేసి రెండు రోజుల్లోగా నివేదిక అందజేయాలని ఆదేశించారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం విశిష్టతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విమానాశ్రయ పరిసరాల్లో నిబంధనలు పాటించని భవన నిర్మాణాలపై చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ కె.దినే ష్‌కుమార్,ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు,ఆర్డీవో ఎ. చైత్ర వర్షిణి,డీఆర్వో జి.నరసింహులు, ఏసీపీ అడ్మిన్ ఎస్ఆర్ రాజశేఖర రాజు, అటవీఅధికారి బి.నాగరాజు, డీఎంహెచ్‌వో వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పదో తరగతోడి పవరేంటో చూపిస్తా

రాజానగరంలో వైసీపీ అవినీతి పెకలిస్తా : బత్తుల

కోరుకొండ,జూలై 15 : గతంలో ఎంపీటీసీ స్థాయి వాడు నాకు పోటీనా అని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఇతర వైసీపీ నాయకులు ఎద్దేవా చేశారని.. ఎమ్మెల్యేగా గెలిచి చూపించానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. కోరుకొండలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పుడు మరలా పదో తరగతోడు ఏం చేస్తాడులే అంటూ సెటైర్లు వేస్తున్నారని.. ఆ పదోతరగతోడి పవరేంటో తొందరలోనే చూపిస్తానని.. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజానగరంలో జరిగిన అవినీతిని కూకటి వేళ్లతో పెకలిస్తానని శపథం చేశారు. తన స్వగ్రామం గాదరాడలో 10వ తరగతి ఫెయిలైనా ఆ తరువాత బీకాం కోర్సులో జాయినై ద్వితీయ సంవత్సరంలో డిస్ కంటిన్యూ చేశానన్నారు. తరువాత హైదరాబాద్‌లోని ఇంగ్లీషు అండ్ ఫారన్ లాంగ్వేజెస్ కోర్సులో జాయినై ఇంగ్లీషులో మాట్లాడడం, రాయడం, చదవడం అభ్యసించానన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేటప్పుడు అఫిడవిట్‌లో రాయాలి కాబట్టి 9వ తరగతి పాస్ అని రాశానన్నారు. సర్టిఫికెట్ లేకపోయినా తనకు నాలెడ్జ్ ఉందన్నారు. గత వైసీపీ పాలనలో రాజానగరం నియోజకవర్గంలో ఎవరెవరు ఏం చేశారో.. బినామీల పేరుతో ఏం వ్యవహారాలు నడిపారో తనకు తెలుసన్నారు. మాటల ద్వారా కాదు.. చేతుల ద్వారా చేసిచూపిస్తానని బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు.

భీమేశ్వరునికి ఇక జలాభిషేకమే!



సూచనలిస్తున్న అధికారులు

పంచామృతాలు, పండ్ల రసాలు వద్దు

పురావస్తు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ కెమిస్ట్ ఉత్తర్వులు

పూర్తి అయిన మూలవిరాట్ సంరక్షణ పనులు

ద్రాక్షారామ, జూలై 15 :ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి జలాలతోనే అభిషేకాలు నిర్వహించాలని కేంద్ర పురావస్తుశాఖ సైన్స్ విభాగం ఆదేశాలు జారీ చేసింది. పాలు, పెరుగు, తేనె, గంధం, కొబ్బరినీరు, గంధం, పండ్ల రసాలు వంటి ద్రవ్యాలతో శివలింగానికి అభిషేకాలు చేపట్టవద్దని స్పష్టం చేసింది. ఇటీవల చేపట్టిన మూలవిరాట్ సంరక్షణ పనులు కేంద్ర పురావస్తుశాఖ పూర్తి చేసింది. మూలవిరాట్ సంరక్షణకు కొన్ని సంరక్షణ చర్యలు అమలు చేయాలని కేంద్ర పురావస్తు శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ కెమిస్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.



కల్తీ ద్రవ పదార్థాలతో నష్టం

స్వామివారి అభిషేకానికి గత రెండు దశాబ్దాల కాలంగా ప్యాకెట్ పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార, పండ్ల రసాలు ఇతర ద్రవ్యాల వినియోగం పెరిగిపోయింది. పరిమితి లేకుండా ద్రవ పదార్థాలు వినియోగిస్తున్నారు. ద్రవ పదార్థాల్లో ఉన్న యాసిడ్ ఇతర రసాయనాలతో మూల విరాట్ రూపం దెబ్బతింది. దీంతో గతంలో 2011లో కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఆలయంలో మూలవిరాట్ సంరక్షణ పనులు నిర్వహించారు. అప్పట్లో కూడా పలు సంరక్షణ చర్యలు పురావస్తుశాఖ అధికారులు సూచించారు. అయితే ఆలయ అర్చకులు, పురోహితులు, భక్తులు, అధికారులు వీటిని పట్టించుకోలేదు. దీంతో ప్రస్తుతం మరోసారి మూలవిరాట్‌కు సంరక్షణ చర్యలు చేపట్టాల్సి వచ్చింది.

ఇవీ చేపట్టాల్సిన జాగ్రత్తలు

స్వామిమూలవిరాట్ సంరక్షణకు పురావస్తు సైన్సు విభాగం పలు సూచనలు చేసింది. స్వామివారి అభిషేకానికి స్వచ్ఛమైన జలాలు వాడాలని సూచించారు. పాలు, పెరుగు, నెయ్యి, నూనెలు, కొబ్బరినీరు, తేనె, అరటిపండ్లు గుజ్జు, పంచదార, గంధం పొడరు, కంకుమ, పండ్లు, పండ్ల రసాలు వినియోగించవద్దని సూచనలు చేశారు. మూలవిరాట్‌ను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, స్వచ్ఛమైన గాలి వీచేలా ఉంచాలని అందుకు ఎగ్జాస్ట్ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, జలాలతో అభిషేకించిన తర్వాత మెత్తటి వస్త్రంతో మూలవిరాట్‌ను తుడవాలని, వారానికి ఒకసారి నాన్ అయోనిక్ డిటర్జంట్‌తో శుభ్రపరచాలని, క్యాయర్‌బ్రష్‌లు వినియోగించాలని ఆదేశాలు ఇచ్చారు. నిమ్మ, వెనిగర్ వంటి యాసిడ్ ఉన్న ద్రవాలతో మూలవిరాట్ రంగు మారిపోతుందని పురావస్తుశాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ కెమిస్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భక్తుల మనోభావాలు.... మూలవిరాట్ సంరక్షణ రెండూ ముఖ్యమే

ద్రాక్షారామ భీమేశ్వరాలయం 892-922 శతాబ్దం మధ్య నిర్మించినట్లు శాసనాలు చెబుతున్నాయి. పురాతన కట్టడంగా కేంద్ర పురావస్తుశాఖ పర్యవేక్షణలో సంరక్షింపబడుతుంది. పురావస్తు సంపదను భావితరాలకు అందించాలనే ధ్యేయంతో పురావస్తుశాఖ కృషి చేస్తోంది. భక్తులు భీమేశ్వరునికి అభిషేకాలు నిర్వహించి స్వామి కరుణాకటాక్షాలు పొందాలని పరితపిస్తుంటారు. ఈనేపథ్యంలో భక్తులు మనోభావాలు దెబ్బతినకుండా.. మూలవిరాట్ రూపం సంరక్షించేలా పీఠాధిపతులు, దేవదాయశాఖ అధికారులు, అర్చకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మరికొద్దిరోజుల్లో స్వామివారి ఆలయం తెరిచి భక్తులకు దర్శనాలు, పూజలకు అవకాశం ఇవ్వనున్నారు. ఈలోగా అందరూ కలిసి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుని ఖచ్చితంగా అమలు చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది.

గ్రహణం మొర్రి ఉందని తుప్పల్లో పడేశారు!

ఒంటిమామిడి గ్రామంలో తుప్పల్లో ఆడ శిశువు

గుర్తించి రక్షించిన స్థానికులు



తొండంగి, జూలై 15: గ్రహణం మొర్రితో పుట్టిందనే కారణంతో ఓ పసిపాపను తుప్పల పాల్జేశారు..బంధాన్ని మరిచి కర్కశంగా వ్యవహరించారు. తొండంగి మండలం ఒంటిమామిడిలో ఈ బాధాకరమైన ఘటన జరిగింది. ఆదివారం రాత్రి ఒంటిమామిడి గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంకు సమీపంలో చీరను చుట్టబెట్టి ఆడ బిడ్డను గుర్తు తెలియని వ్యక్తులు తుప్పల్లో వదిలి వెళ్లారు. సెంటర్‌లో చికెన్ షాపు నిర్వహించుకునే లోవరాజు అనే వ్యక్తి అక్కడ తనకున్న పాక వద్దకు వెళ్లగా తుప్పల్లోంచి పాప ఏడుపు వినబడింది. వెంటనే అక్కడకు వెళ్లి చూడగా గ్రహణం మొర్రితో ఉన్న పండంటి ఆడబిడ్డ కనిపించింది. విషయాన్ని సర్పంచ్ అంగులూరి సుధాకర్‌కు తెలపడంతో వెంటనే అక్కడకు చేరుకున్న ఆయన పోలీసు, రెవెన్యూ, ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో పోలీసులు, సర్పంచ్ పర్యవేక్షణలో బిడ్డకు ప్రాథమిక చికిత్స అందించి ఆశ వర్కర్లు అంగన్వాడీల సహాయంతో 108 అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కేవలం రోజుల వయసున్న బిడ్డకు గ్రహణం మొర్రి ఉండడంతో భవిష్యత్తులో ఏమైనా ఇబ్బందులు వస్తాయని మూర్ఖంగా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. స్థానికంగా ఉన్న వ్యక్తులే ఈ పనికి పాల్పడ్డారా లేదా దూరం నుంచి పాపను తీసుకువచ్చి వదిలివేసారా అనేది తేలాల్సి ఉంది. పాపను వదిలి వెళ్లిన ప్రాంతం నిర్మానుష్యంగా ఉండడంతో పాటు పందుల సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతమని స్థానికులు చెబుతున్నారు. లోవరాజు ఆ సమయానికి వెళ్లకపోతే ప్రమాదం జరిగి ఉండేదని అంటున్నారు. ప్రస్తుతానికి పాప ఆరోగ్యం బాగానే ఉన్నట్లు తెలిసింది. గ్రహణం మొర్రి అనేక ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నా, ప్లాస్టిక్ సర్జరీలు లాంటి అడ్వాన్స్‌డ్ చికిత్సలు ఉన్నా ఇలా తుప్పలు పాలుచేయడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తొండంగి ఎస్ఐ వినయ్ ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.1.23 కోట్లు

ఆత్రేయపురం, జూలై 15: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. పర్యవేక్షణాధికారులు డి.నాగమల్లేశ్వరరావు, పి.కామేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. 33 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.86,25,835, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.37,04,021 మొత్తం రూ.1,23,29,856 ఆదాయం లభించింది. 21 గ్రాముల బంగారం, కిలో వెండి, పలు దేశాల కరెన్సీ లభించినట్లు ఆలయ ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.2,96,819 లభించింది. లెక్కింపులో బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలో నగదు చోరీ

గొల్లప్రోలు రూరల్, జూలై 15: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ నుంచి నగదు చోరీకి గురయింది. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన ఇంటి అమరావతి తన సోదరి దగ్గర తీసుకున్న డబ్బులను తిరిగి ఇచ్చేందుకు గానూ రూ.70వేలు బ్యాగులో పెట్టుకుని సోమవారం పిఠాపురం వెళ్లేందుకు ఆటో ఎక్కింది. ఇదే ఆటోలో చేబ్రోలులో ఇద్దరు మహిళలు ఎక్కారు. పిఠాపురం అని చెప్పిన మహిళలు ఇద్దరు గొల్లప్రోలులో దిగిపోయారు. పిఠాపురంలోని సోదరి ఇంటి వద్దకు వెళ్లి చూసుకునేసరికి బ్యాగులో ఉండాల్సిన రూ.70 వేలు లేకపోగా బ్యాగు కోసి ఉన్నట్లు గుర్తించారు. ఆటోలోకి చేబ్రోలులో ఎక్కిన మహిళలే ఈ చోరీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు.

అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్ నిర్వహించారు. విచారణలో ఉన్న ఖైదీల కేసుల దర్యాప్తు, చార్జిషీటు ఫైల్ చేయడంలో పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. బెయిలు/జామీను విషయంలో ఖైదీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సంబంధిత అధికారులకు తగిన సిఫార్సులు చేశారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

60 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లతాకుమారి

ప్రత్తిపాడు, జూలై 15: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం వద్ద 60 కిలోలు గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను ప్రత్తిపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ గంజాయి విలువ మార్కెట్‌లో రూ.3 లక్షలు ఉంటుందని తెలిపారు. ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి వివరాలను వెల్లడించారు. పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు మండలంలోని ధర్మవరం శివారు తమ్మయ్య చెరువు వద్దషెడ్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.3 లక్షలు విలువ చేసే 60 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని సింహాద్రిపురం గ్రామానికి చెందిన కందా సూర్యనారాయణ, ధర్మవరం గ్రామానికి చెందిన ఒనుం ఏసుబాబులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీన పరుచుకుని గంజాయిని సీజ్ చేశారు. ఈ సంఘటనలో సింహాద్రిపురం గ్రామానికి చెందిన మొగిలి మణికంఠ పరారీలో ఉన్నట్లు పెద్దాపురం డీఎస్పీ తెలిపారు. పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని తీసుకొచ్చి ధర్మవరం శివారు తమ్మయ్య చెరువు వద్ద ఉన్న షెడ్‌లో అక్రమంగా నిల్వ చేసి నిందితులు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారని వారిని సీఐ శేఖర్ బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ బృందం ఆదివారం దాడి చేసి అదుపులోకి తీసుకుందన్నారు. చాకచక్యంగా గంజాయి గుట్టును రట్టు చేసిన సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

భార్యను హతమార్చిన వ్యక్తికి జీవితఖైదు

కె.గంగవరం, జూలై 15: మద్యం సేవించి భార్యను చిత్రహింసలకు గురిచేయడమే కాకుండా ఆమెను హత్య చేసిన వ్యక్తికి జీవితఖైదు విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందని పామర్రు ఎస్ఐ కె.జానీబాషా చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం తామరపల్లి గ్రామానికి చెందిన గుత్తుల భవానీకి కపిలేశ్వరపురం మండలం నాగులచెరువు గ్రామానికి చెందిన మేడిశెట్టి శ్రీనుకు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. శ్రీను ఏవిధమైన పని చేయకుండా భార్య చేసిన కూలి డబ్బులపై ఆధారపడుతూ మద్యం సేవించి భవానీని హింసించేవాడు. దీంతో భవాని తండ్రి శేషారావు తన కుమార్తెను ఇంటికి తీసుకువచ్చేశాడు. సుమారు మూడు నెలల తర్వాత తాను మారానని శ్రీను మామగారికి నచ్చచెప్పి, తామరపల్లి గ్రామంలో భార్యతో కలిసి వేరు కాపురం పెట్టాడు. 2021 అక్టోబరు 13న శేషారావు కూలి పనికి వెళ్లి వచ్చి తమ కుమార్తె ఇంటికి తాళం వేసి ఉండటం గమనించాడు. తాళం పగలకొట్టి చూస్తే భవాని రక్తపు మడుగులో చనిపోయి ఉంది. దీనిపై అప్పుడు పామర్రు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కె.చిరంజీవి కేసు నమోదు చేశారు. శ్రీనును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. రాజమహేంద్రవరం కోర్టులో వాదోపవాదనలు అనంతరం నేరం రుజువు అయ్యింది. జడ్జి డి.విజయ్‌గౌతమ్ నిందితుడికి జీవితఖైదు, రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఆయన చెప్పారు.

వ్యాన్ ఢీకొని ఇద్దరి మృతి



దుర్గారావు, వెంకటేశ్వరరావు మృతదేహాలు



జక్కం వెంకటేశ్వరరావు



గండి దుర్గారావు

రాజానగరం/దివాన్‌చెరువు, జూలై 15: రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జి.యర్రంపాలెం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. రాజానగరం మండలం పాతతుంగపాడు గ్రామానికి గండి దుర్గారావు(32), కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన జక్కం వెంకటేశ్వరరావు (35) మోటార్‌సైకిల్‌పై దుళ్ల నుంచి పాతతుంగపాడు పయనమయ్యారు. మార్గమధ్యంలో జి.యర్రంపాలెం సమీపానికి వచ్చే సరికి ఎదురుగా టాటాఎస్ వ్యాన్ వీరిని బలంగా ఢీకొని ఆపకుండా వెళ్లిపోయింది. స్థానికులు గమనించి వాహనాన్ని ఆపారు. కాగా దుర్గారావు అత్త వారి ఊరు దుళ్లలో ఉంటూ తాపీ పనిచేస్తున్నాడు. తుంగపాడులో అరటి తోట కౌలుకు తీసుకున్నాడు. అరటి గెలలు కోసేందుకు దుళ్ల నుంచి వెంకటేష్‌ను వెంట బెట్టుకుని వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కాగా దుర్గారావుకు ఓ కుమార్తె ఉండగా భార్య ప్రస్తుతం గర్భిణి. వెంకటేష్‌కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే పాతతుంగపాడుకు చెందిన పలువురు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాజానగరం ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దుళ్లలో విషాదఛాయలు

కడియం, జూలై 15: తుంగపాడులో జరిగిన ప్రమాదంలో దుళ్ల గ్రామానికి చెందిన జక్కం వెంకటేశ్వరరావు, గండి దుర్గారావు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునే వారే. వారి మృతితో ఆ కుటుంబాలు ఆధారాన్ని కోల్పోయాయి. జక్కం వెంకటేశ్వరరావుకు భార్య విజయలక్ష్మి, ఇంటర్ పాసైన కుమార్తె లీలా నాగదివ్య, పదో తరగతి చదువుతున్న శశిధర్ ఉన్నారు. గండి దుర్గారావుకు భార్య నాగలక్ష్మి, ఒకటో తరగతి చదువుతున్న కుమార్తె సంధ్యాదేవి ఉన్నారు. ప్రస్తుతం దుర్గారావు భార్య నాగలక్ష్మి 6 నెలల గర్భిణి.

ఇన్‌స్టాలో పరిచయం

యువకుడితో వెళ్లిపోయిన 17ఏళ్ల అమ్మాయి

20 గంటల్లోనే పట్టుకున్న పోలీసులు

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఓ 17ఏళ్ల బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయి రాష్ట్రం దాటేసింది. ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు 20 గంటల్లో ఆచూకీ కనిపెట్టేశారు. సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఓ అపార్టుమెంటులో కుమారుడు, ఇద్దరు కుమార్తెలతో ఒక కుటుంబం నివసిస్తోంది. పెద్ద కుమార్తె ఇంటర్ వరకూ చదువుకుంది. అయితే ఈ నెల 11న ఉదయం ఇంట్లో వాళ్లు నిద్రలేచే సరికి ఆమె కనిపించలేదు. వాకబు చేసినా ఫలితం లేక అదేరోజు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్ఐ బి.వినోద్ తమ సిబ్బందితో రంగంలోకి దిగి గాలింపు ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా రైల్వే స్టేషన్‌లోని సీసీ ఫుటేజీని పరిశీలించారు. 11వ తేదీ తెల్లవారుజామున 4 గంటల సమయంలో బాలిక, ఓ యువకుడు రైల్వే స్టేషనుకు వెళ్లి విశాఖ వైపు వెళ్లే గరీబ్‌రథ్ ఎక్కినట్లు గుర్తించారు. సాంకేతిక సహాయంతో అక్కడి నుంచి గుజరాత్‌లోని అహ్మదాబాద్ వెళ్లే రైలులో వెళుతున్నట్టు తెలుసుకున్నారు. వెంటనే అక్కడి రైల్వే భద్రతా దళం(ఆర్పీఎఫ్) పోలీసులను, బాలిక బంధువులను అప్రమత్తం చేశారు. 12న మధ్యాహ్నం బాలిక, యువకుడు అక్కడ దిగిన వెంటనే ఆర్పీఎఫ్ పోలీసులు వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇక్కడి నుంచి బాలిక తండ్రి, పోలీసు బృందం అహ్మదాబాద్ వెళ్లి వాళ్లిద్దరినీ సోమవారం రాజమహేంద్రవరం తీసుకొచ్చారు. మధ్యప్రదేశ్‌లోని దామో జిల్లా వైశాలి నగర్‌కి చెందిన 19ఏళ్ల యాష్ అగర్వాల్‌తో ఈ బాలికకు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయం ఏర్పడిందని డీఎస్పీ చెప్పారు. బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించి అగర్వాల్‌ను అరెస్టు చేశామని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల విషయంలో పిల్లలను గమనిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. కేసును త్వరితగతిన ఛేదించడంలో ప్రతిభ చూపిన డీఎస్పీ అంబికా ప్రసాద్, టూటౌన్ సీఐ వి.శ్రీనివాస్, ఎస్ఐ బి.వినోద్, హెచ్‌సీ వై.మహేశ్వరరావు, పీసీలు వీరబాబు, కె.ప్రదీప్ కుమార్‌ను ఎస్పీ జగదీశ్ అభినందించారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారం

ఇద్దరిపై కేసు నమోదు

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారనే ఫిర్యాదుతో ఇద్దరు వ్యక్తులపై ప్రకాశంనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సత్యనారాయణ తెలిపిన, ఎఫ్ఐ ఆర్‌లోని వివరాల ప్రకారం.. పోస్టల్ కాలనీకి చెందిన తురాల శ్రీనివాస్ యాదవ్ కుమార్తె శిరీషా యాదవ్‌కి ఈ ఏడాది మార్చి 20న 77299 48662 నంబరు నుంచి ఒక మేసేజ్ వెళ్లింది. దీనిపై విచారించగా గుత్తుల మురళీ కృష్ణ, కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వైరిచర్ల ఉదయ భాస్కర్ అదే మెసేజ్‌లు పోస్ట్ చేసినట్టు తెలిసింది. బాధితుడు శ్రీనివాస యాదవ్ ఎస్పీకి ఫిర్యాదు చేయగా ప్రాథమిక విచారణ అనంతరం ఆదివారం రాత్రి ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో 'రాత'కు ప్రథమ స్థానం

పోర్టు సిటీ (కాకినాడ), జూలై 15: అల్లూరి సీతారామరాజు నాటక కళాపరిషత్ 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో 'రాత' నాటిక ప్రథమస్థానం కైవసం చేసుకుంది. కళాపరిషత్ 40వ వార్షికోత్సవంలో భాగంగా గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా సోమవారం వివరాలను కళాపరిషత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అచ్యుతరామారెడ్డి, పంపన దయానందబాబు వెల్లడించారు. వెలగలేరుకు చెందిన థియేటర్ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన ఈ నాటిక ప్రథమస్థానం సాధించిందన్నారు. పోలుదాసు శ్రీనివాసరావు రచన, దర్శకత్వం వహించారు. ద్వితీయ, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా స్వప్నం రాల్చిన అమృతం, విముక్తి నాటికలు నిలిచాయి. ఉత్తమ దర్శకుడిగా పోలుదాసు శ్రీనివాసరావు, ఉత్తమ నటిగా జ్యోతిరాణి, ఉత్తమ నటుడుగా జీవీ మనోహర్ బహుమతులు పొందారు. ఉత్తమ సంగీత దర్శకుడిగా నాగరాజు, ఉత్తమ విలక్షణ నటుడిగా వి.నాంచారయ్య బహుమతులు సాధించారని వివరించారు.

54 టెస్టులతో నీటి నాణ్యతను పరిశీలించాలి

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల పరిధిలో ప్రజలకు సరఫరా చేసే మంచినీటికి సంబంధించి వివిధ దశల్లో మొత్తం 54 టెస్టులు చేసి ఆ నీటి పరిస్థితిని నిర్ధారించాలని పబ్లిక్ హెల్త్ రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈ ఎ.సుధాకర్ తెలిపారు. ఈ మేరకు మునిసిపాలిటీలకు సోమవారం ప్రత్యేక సూచనలు చేశారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్టు తెలిపారు. తమ సర్కిల్ పరిధిలో రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్లు, 18 మునిసిపాలిటీలు, 3 నగర పంచాయతీలు ఉన్నాయని, వాటి పరిధిలో రోజూ సుమారు 285 మిలియన్ లీటర్ల శుభ్రపరిచిన తాగునీటిని సరఫరా చేస్తామని, మరో 59 ట్యాంకర్ల ద్వారా 376 ట్రిప్‌లతో అదనంగా 1.8 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. గ్రామాల నుంచి నగర పంచాయతీలకు మారిన వాటిలో పైపులైన్ల సమస్య ఉందని, మిగతా చోట్ల కూడా పాత పైపులైన్లను తీసేసి కొత్తవి వేయాలని గతంలోనూ సూచించినట్టు చెప్పారు. వర్షాకాలంలో పైపులైన్ల లీకుల వల్ల మంచినీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. మంచినీటిని వ్యాధికారక లక్షణాలు, ఇతర లోపాలు నిర్ధారించడానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసెడ్యూర్స్ (ఎస్ఓపీ) గైడ్‌లైన్స్‌ను తమ ఈఎన్‌సీ జారీ చేసిందన్నారు. వాటి ప్రకారం ఫిజికల్, కెమికల్, బ్యాక్టీరియోలాజికల్, హెవీ మెటీరియల్, పెస్టిసైడ్స్ వంటి ఐదు విభాగాల్లో మొత్తం 54 రకాల పరీక్షలు చేయాలన్నారు. ఫిజికల్ విభాగంలో ప్రతి రోజూ ఆరు రకాల పరీ క్షలు చేయాలన్నారు. భూగర్భజలాలు, బోరు బావులు, చేతిపంపులు, ఇన్‌ఫి ల్ట్రేషన్ బావుల్లో నెలకోసారి ఈ పరీక్షలు చేయాలని సూచించారు. కెమికల్ విభాగంలో 12 రకాల టెస్టులు ఉంటాయని తెలిపారు. బ్యాక్టీరియాకోలి టెస్ట్ వారానికొకసారి చేయాలని చెప్పారు. హెవీమెటీరియల్ విభాగంలో 21 రకాల టెస్టులు చేయవలసి ఉంటుందని తెలిపారు. మూడు నెలలకొకసారి పరీక్షలు నిర్వహించి నిర్ధారించుకోవాలన్నారు. ఇక పెస్టిసైడ్స్ విభాగంలో 14 రకాల టెస్టులు మూడు నెలలకోసారి చేయాలన్నారు. ఆర్గో క్లోరైడ్స్‌కు సంబంధించిన 5 పరీక్షలు ఉంటాయని, వాటిలో మిథైల్ పార్థాన్, మిలాథిన్, క్లోర్పైఫోస్, ఈథిన్, మోనోక్రోటోఫస్ వాటి పరీక్షలను మూడు నెలలకు ఒకసారి నిర్వహించాలని తెలిపారు.

నిర్వాసితులకు పునరావాస కల్పనకు చర్యలు

పోలవరం ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ

అమలుకు గ్రామాల వారీగా కమిటీలు

రంపచోడవరంలో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్



కలెక్టర్‌ను ఎత్తుకుని తీసుకువస్తున్న గిరిజనులు

రంపచోడవరం, జూలై 15: 'పోలవరం' నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళ వందనంతో కలిసి పోలవరం ప్రాజెక్టు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన పోలవరం ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుకు గ్రామాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముంపు బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. భూమికి భూమి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అంబేడ్కర్, మమ్మీ, తహశీల్దార్లు చలపతిరావు, సులోచన, డీటీలు కుమారి, కృష్ణశాస్త్రి, ప్రజ్ఞ, చిరంజీవి, త్రిమూర్తులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు అర్జీల వెల్లువ

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అల్లూరి జిల్లా కొత్త కలెక్టరు దినేష్ కుమార్ అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఏజెన్సీ నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ముఖ్యంగా పోలవరం నిర్వాసితులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. అర్జీల స్వీకరణ కార్యక్రమానికి కొత్త కలెక్టర్ రావడంతో అర్జీదారులు అధిక సంఖ్యలో తమ సమస్యలను చెప్పుకునేందుకు గ్రీవెన్స్‌కు హాజరయ్యారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ జాన్‌రాజ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, ఐసీడీఎస్ పీడీ సూర్యకుమారి, డ్వామా పీడీ ఎం.శివయ్య, ఏఎంవో సి.శ్రీహరి, జిల్లా వ్యవసాయాధికారి నందు, వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, డీడీ షరీఫ్, జీసీసీ డీఎం జి.పార్వతీశ్వరరావు, డీఎల్‌పీవో రఘునందన్, ఏడీఎంహెచ్‌వో జి.శిరీష, సర్వే ఇన్‌స్పెక్టర్ కె.దేవేంద్రుడు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అపూర్వ స్వాగతం

అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ రంపచోడవరంలో అఖండ స్వాగతం లభించింది. సంప్రదాయ నృత్యాలతో గిరిజనం ప్రేమతో నూతన కలెక్టర్‌కు ఆహ్వానం పలికారు. భుజాలకెత్తుకుని ఆయనను కొద్ది దూరం తీసుకువచ్చారు. గతంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన ఆయన ఇక్కడి గిరిజనుల మన్ననలు పొందారు. ఇప్పుడు అల్లూరి జిల్లా కలెక్టర్‌గా తమ ప్రాంతానికి రావడంతో రంపచోడవరం ప్రారంభం నుంచి ఆయనను ఊరేగింపుగా గిరిజనులు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ రంపచోడవరం మండలం ఐ.పోలవరంలోని టీటీడీ వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మఠం విజయభాస్కర్, గిరిజన సంఘాల నాయకులు వెదుళ్ల లచ్చిరెడ్డి, పండా చెల్లన్నదొర, వై.నిరంజనీదేవి పాల్గొన్నారు.

పోశమ్మగండి వద్ద బోట్ల ప్రయాణం నిషేధం

దేవీపట్నం, జూలై15: మండలంలోని పోశమ్మగండి వద్ద వరద ఉధృతిని సోమవారం రంపచోడవరం సీఐ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గోదావరిలో బోట్లపై ప్రయాణం మానుకోవాలని, చేపల వేటకు వెళ్లరాదని పలు సూచనలు చేశారు. గోదావరి పెరుగుతున్న కారణంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

12 అడుగుల కొండ చిలువ హతం



ప్రత్తిపాడు, జూలై 15:మండలంలోని ఒమ్మంగి గ్రామంలో సోమవారం 12 అడుగుల కొండ చిలువను స్థానికులు హతమార్చారు. ఒమ్మంగి గ్రామానికి చెందిన రైతు కొండపల్లి శ్రీనివాస్ పొలంలో కొండ చిలువ కలియ తిరుగుతుండటంతో పొలంలో పని చేస్తున్న వ్యవసాయ కూలీలు గుర్తించి దానిని హతమార్చారు. 12 అడుగుల పొడవు ఉన్న ఈ కొండ చిలువను చూసేందుకు ఆసక్తిగా పొలానికి తరలివచ్చి తిలకించారు.

ఏజెన్సీ సమాచారం

యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

మోతుగూడెం, జూలై15: సోకిలేరు వాగులో స్నానానికి దిగి గల్లంతైన అల్లూరి తేజ(24) మృతదేహం సోమవారం లభ్యమైంది. విజయవాడ గుణదలకు చెందిన అల్లూరి తేజ స్నేహితులతో కలిసి ఆదివారం చింతూరు మండలం సోకులేరు పర్యటన ప్రాంతానికి వచ్చారు. సోకిలేరులో స్నానానికి దిగి గల్లంతైన విషయం తెలిసిందే. సంఘటన జరిగిన కొంత దూరంలోనే సోమవారం సాయంత్రం లక్కవరం యూత్, పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు. ఎస్‌ఐ జీగోపాలరావు ఆదేశాలతో యూత్ సాయంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలు కలెక్టర్ దృష్టికి

దేవీపట్నం, జూలై 15: పోలవరం నిర్వాసితుల సమస్యలను పాడేరు జిల్లా కలెక్టర్ దృష్టికి సోమవారం నిర్వాసితులు తీసుకెళ్లారు. సోమవారం రంపచోడవరం ఐటీడీఏలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ గ్రీవెన్స్ నిర్వహించడంతో పోలవరం ముంపునకు గురైన 44 గ్రామాల నిర్వాసితులు వారి సమస్యలు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పునరావాస గ్రామాల్లో పర్యటించి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ప్రత్యేక ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

దేవీపట్నం, జూలై 15: ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఎం పోస్టులు భర్తీ చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు సోమవారం గ్రీవెన్స్‌లో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, కార్యదర్శి కారం రామన్నదొర వినతిపత్రం అందజేశారు.

కూనవరం మండల వాసుల్లో వరద భయం



సామగ్రిని తరలిస్తున్న దృశ్యం

కూనవరం, జూలై15: జూలై నెలలోనే కూనవరం మండల వాసులకు వరద భయం పట్టుకుంది. గతంలో వరుసగా వరదలు వస్తుండడంతో ప్రజలు సర్వం కోల్పోయారు. 2022, 2023 వచ్చిన వరదలకు మండలంలో ప్రజలకు చిల్లిగవ్వ కూడా మిగల్లేదు. గత బాధలను గుర్తుపెట్టుకుని ఈ ఏడాది కొంచెం ముందుగానే ప్రజలు తేరుకున్నారు. ఒకవైపు వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు పునరావాసాలకు ఇంట్లో ఉన్న సామగ్రిని తరలిస్తున్నారు. ఈ సారైనా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొంటాం



మాట్లాడుతున్న తహసీల్దార్ శేఖర్

ఎటపాక, జూలై 15: వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని తహసీల్దార్ శేఖర్ తెలిపారు. సోమవారం ఎటపాకలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 13 ముంపు ప్రభావిత ప్రాంతాల్లో బోటు పాయింట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 13 చోట్ల సురక్షిత ప్రాంతాల్లో బఫర్ స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామస్థాయి కమిటీలను నియమించామని, కమిటీ సభ్యులు గోదావరి వరద సమాచారాన్ని ప్రజలకు చేరవేసి, అప్రమత్తం చేస్తారని తెలిపారు. ముంపు ప్రభావిత ఏరియాల్లో ముగ్గురు జోనల్ ఆఫీసర్లను నియమించామని, ఒక్కొక్కరికీ ఐదు నుంచి ఏడు పంచాయతీల మోనటరింగ్ బాధ్యతలను అప్పగించామని చెప్పారు. వరద దృష్ట్యా రెండు నెలలకు సరిపడా నిత్యావసరాలు, బియ్యం ఈ నెలలో పంపిణీకి చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. వరదల సమయంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గోగుబాకలో ఆగని ప్రభుత్వ భూముల ఆక్రమణ

పట్టించుకోని రెవెన్యూ అధికారులు

ఎటపాక, జూలై 15: ఎటపాక మండలం, గోగుబాక గ్రామంలో ప్రభుత్వ భూమిని ఇటీవల కాలంగా కొందరు ఆక్రమిస్తున్నారు. పోడు పేరుతో ఆ భూముల్లో తుప్పలు, మోడులను యంత్రాలతో తొలగిస్తూ శుభ్రం చేస్తున్నారు. సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకునేందుకు పన్నాగం పన్నారు. ప్రభుత్వ భూమి గుట్ట ప్రాంతంలో ఉండడంతో గుట్టు చప్పుడు కాకుండా ఆ భూమిని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. గతంలో ఆ భూమిను సాగు చేసుకుంటున్న కొందరు గిరిజనుల నుంచి దౌర్జన్యంగా దున్నేస్తూ స్వాధీనం చేసుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. బాధితులు ఇటీవల ఈ వ్యవహారంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. రోజూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఎటువంటి స్పందన లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరుకు వినతిపత్రం



కలెక్టర్‌ను సత్కరించిన ఉపాధ్యాయులు

రంపచోడవరం, జూలై 15: ఏజెన్సీలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఏఎస్ దినేష్‌కుమార్ కలిసి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న అన్ని కేడర్ల ఉపాధ్యాయ పోస్టులను స్పెషల్ డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టాలని, జీవో నెం.3ని పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని, జీవో నెం.45ను సవరించి జీవో నెం.1 ప్రకారం గిరిజన సంక్షేమశాఖలో డీఈవో(ఏ)-2, డీవైఈవో(ఎ)-3 పోస్టులను హెడ్మాస్టర్లతో నియామకాలు చేపట్టాలని, ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించాలని కోరుతూ కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు వై.విల్సన్‌బాబు, కె.ఆదిరెడ్డి, జి.విశ్వరాజ్, కె.సూరిబాబు, సనాతనబాబు, చిన్నిబాబు, కృష్ణారెడ్డి తదితరులు కలెక్టరు కలిసిన వారిలో ఉన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రులు

బిక్కవోలు, జూలై 15: కొంకుదురులో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిసాయి. అర్చకులు రమణశర్మ ఇంట కలశ స్థాపన చేసిన పారాయణ బృందం ప్రతిరోజూ సాయంత్రం లలితా సహస్రనామం, శ్రీదేవి ఖడ్గమాల, వారాహి స్తుతి, చండీ సప్తశతులను పారాయణం చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా వారాహిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

18 నుంచి లెప్రసీపై ఇంటింటి సర్వే

కలెక్టర్ ప్రశాంతి.. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ



కుష్టు నిర్మూలన కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15: జిల్లాను కుష్టు రహితంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ జిల్లాలో లెప్రసీ డిటెక్షన్ క్యాంపెయిన్ ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి వెల్లడించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ఇంటింటి సర్వే ద్వారా కుష్టువ్యాధి గుర్తింపు, ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపడతారన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కుష్టు సస్పెక్ట్ కేసుల సర్వే వియవంతం చేయాలన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర, ఇన్‌చార్జి జేసీ దినేష్‌కుమార్, డీఆర్‌వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కేంద్రాల పనితీరు పర్యవేక్షణ

రాజమహేంద్రవరం రూరల్, జూలై 15: స్త్రీ సంక్షేమం, భద్రత, భరోసా, బాలిక విద్యపై దృష్టిసారించాలని, వర్చ్యువల్ ద్వారా ఐసీడీఎస్ కేంద్రాల నిర్వహణ పనితీరును ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేస్తానని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో స్త్రీ సంక్షేమ శాఖ సీడీపీవోలతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా స్త్రీ సంక్షేమం, ఆరోగ్య పరంగా, బాలిక విద్య, గర్భిణులకు ఐచ్ఛితమైన ఆరోగ్య సంరక్షణ వంటి వాటిపై ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండాలన్నారు. బేటీ పడావో-బేటీ బచావో కార్యక్రమ ఉద్దేశ్యం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడమేనని స్పష్టం చేసారు. ఏ తల్లీ బలహీనంగా వున్న పిల్లలను కావాలని కోరుకోరని, ఆ మేరకు తల్లుల్లో అవగాహన కల్పిస్తే సంపూర్ణ ఆరోగ్యంతో పిల్లలు పుట్టే అవకాశం వుందన్నారు. బాల్య వివాహాలు అరికట్టాలన్నారు. త్వరలో క్షేత్ర స్థాయిలో అంగన్వాడీ కేంద్రాలను సందర్శనకు వస్తామన్నారు. ఆ సమయంలో ప్రీస్కూలు నిర్వహణ, హాజరుశాతం పరిశీలిస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, జిల్లా పిల్లల సంరక్షణ అధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిడింగొయ్యి పంచాయతీ తనిఖీ

రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి పంచాయతీని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో పనిచేసే సిబ్బంది సంఖ్య, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై ఆరా తీశారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నియంత్రణ చర్యల్లో భాగంగా పంచాయతీల పరిధిలో పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. డ్రైనేజీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. కాగా డిజటల్ అసిస్టెంట్ వుండగా కంప్యూటర్ ఆపరేటర్ పనేంటి అని కార్యదర్శి రూప్‌చంద్‌ను ప్రశ్నించగా నీళ్లు నమలినట్టు తెలిసింది. ఏ గ్రామానికి చెందిన పంచాయతీ సిబ్బంది అంతా ఆ గ్రామ పంచాయతీ పరిధిలోనే పని చేసేలా చూడాలంటూ పంచాయతీ అధికారులను ఆదేశించారు.

పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం

37వ డివిజన్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 15: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ 36,37 డివిజన్‌లను అనుసంధానం చేసే మేజర్ డ్రెయిన్ నిర్మాణ పనులు నెల రోజుల్లో పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 37వ డివిజన్‌లో సోమవారం ఆయన డ్రైనేజీలను పరిశీలించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మేజర్ డ్రెయిన్ పనులు గత ప్రభుత్వ హయాంలో ముందుకు సాగలేదన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనుల్లో జాప్యం జరిగిందన్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి నెలరోజుల్లో డ్రెయిన్ పనులు పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ డ్రైన్ నిర్మాణం పూర్తయితే లలితానగర్, ఆదెమ్మదిబ్బ ప్రాంత ప్రజలకు మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉర్లంకల లోకేశ్, ఆశ వర్కర్లు , సచివాలయ సెక్రటరీలు, రిసోర్స్ పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ 13 బ్యాడ్మింటన్ విజేత దివ్యశ్రీ సత్య

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15: రాజమహేంద్రవరంలో ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించిన అండర్ 13 బ్యాడ్మింటన్ సింగిల్స్ డబుల్స్ పోటీల్లో ఆదర్శ బ్రిలియంట్ స్కూల్ విద్యార్థిని బుద్దా దివ్యశ్రీ సత్య విజేతగా నిలిచింది. విజేత దివ్యశ్రీ సత్యను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, స్కూల్ కరస్పాండెంట్ పెనకటి గంగాధరరావు అభినందించారు.

ఆర్టీసీ డిపోలో తాగునీరు పునరుద్ధరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోపకరం, జూలై 15: ప్రయాణికులకు కొంతకాలంగా తాగునీరు సరఫరా నిలిచిపోయిన గోకవరం ఆర్టీసీ డిపోలో తాగునీటి సౌకర్యాన్ని అధికారులు సోమవారం పునరుద్ధరించారు. డిపో ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ట్యాంకు నుంచి ప్రయాణికులకు నీరందేలా డిపో మేనేజర్ యు.రామన్నదొర చర్యలు చేపట్టారు. ఈ నెల 14న ఆంధ్రజ్యోతిలో చినుకు పడితే చిత్తడే శీర్షికన వచ్చిన కథనంలో తాగునీటి సమస్యపై వచ్చిన అంశంపై మేనేజర్ స్పందించారు. వాటర్‌ట్యాంక్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించారు.

దుర్గాభాయ్ దేశ్‌ముఖ్‌కు ఘన నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 15: ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాలలో సోమవారం దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ జయంతిని నిర్వహించి కళాశాలలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ అసదుల్లా, కరస్పాండెంట్ శిఘాకొల్లి సీతారామాంజనేయులు, ప్రిన్సిపాల్ జోగినాయుడు పాల్గొన్నారు.

పిల్లలను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 15: చిన్నప్పటి నుంచి పిల్లలు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించేలా చేయాలని అఖిల భారత క్రీడా భారతి జాయింట్ సెక్రటరీ మధు మాయినాథ్ (కోల్‌కత్తా) సూచించారు. ఏపీలోని వివిధ జిల్లాల పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం విచ్చేసిన సందర్భంగా ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నప్పటి నుంచి పిల్లలు క్రీడల్లో రాణించేలా చూడాలని హితవు పలికారు. జాతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు, ఓఎన్‌జీసీ విశ్రాంతి ఉద్యోగి ఎస్.అనిల్‌కుమార్‌ను జిల్లా క్రీడాభారతి అధ్యక్షుడిగా, సీహెచ్ వెంకటేశ్వరరావును జనరల్ సెక్రటరీగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మధు మాయినాథ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ జీఎస్ మూర్తి, ధనుంజయరెడ్డి, ఎం.సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 15: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రాధ్యక్షుడు కేశన శంకరరావు జన్మదినం సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వంకా మల్లికార్జునస్వామి ఆధ్వర్యంలో సోమవారం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు దూది తాతారావు, దాడి శ్రీనివాస్, సూరంపూడి శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, వంకా సురేంద్రకుమార్, నక్కా గోవిందరాజు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్సు ఉద్యోగాలపై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, జేకేసీ ఆధ్వర్యంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్సు ఉద్యోగాలపై అవగాహన కల్పించారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్సుకు చెందిన ఎస్.సందీప్ బృందం పలు విషయాలు వివరించారు. అగ్నిపథ్‌ను ఎలా ఎదుర్కొనాలో, ప్రాథమిక పరీక్షకు ఎలా సిద్ధపడాలో ఉద్యోగార్హతలు, ఎంపికైన తర్వాత శిక్షణ వివరాలను తెలిపారు. విద్యార్థులు ఈ ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మల్లికార్జున తెలిపారు.

బీకాం జనరల్ కోర్సు కొనసాగించాలి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15: డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సును ఎత్తివేస్తున్నట్టు తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సును చదవడానికి ఇష్టపడతారన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనా వెబ్‌సైట్‌లో బీకాం జనరల్ ఆప్షన్ కనిపించకపోవడం, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సు కనిపించడంతో విద్యార్థులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని బీకాం జనరల్ కోర్సు కొనసాగించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా బాబులు పుట్టినరోజు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15: జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వాహక కార్యదర్శి చిక్కాల బాబులు పుట్టినరోజును ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాజమహేంద్రవరం బాలాజీపేట రామకృష్ణ నగర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం అర్ధరాత్రి బాబులుతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు యాండ్రపు రామకృష్ణ, కొయ్య కల్యాణ్, బోజంకి శ్రీను, తాపేశ్వరం మురళీ, పాన్‌షాప్ శ్యాం, బూర చిన్ని, టైలర్ మహేష్ పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే నల్లమిల్లి

పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి వినతి



అనపర్తి, జూలై 15: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనపర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి కళాశాలకు అవసరమైన భూమిని సేకరించాలన్నారు. అలాగే వెలగపూడి సచివాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కలిసి చాగల్నాడు, వెంకటనగర్ ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి తీసుకువస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు. తదుపరి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను, విజయవాడ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గుమ్మళ్ల సృజన, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన మహేష్‌చంద్ర లడ్హాలను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పౌష్టికాహారం పంపిణీ

అనపర్తి, జూలై 15: అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందించే పౌష్టికాహారంపై అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్ధ వహించాలని టీడీపీ మండలాధ్యక్షుడు కొవ్వూరి దత్తుడు అన్నారు. సోమవారం అనపర్తి పాతవూరిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన వైద్య సేవలందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు కొవ్వూరి వెంకటరామారెడ్డి, సముదానపాలెపు వీరన్న, చింతా సుజాత, సూర్య మంజు పాల్గొన్నారు.

చల్లా ప్యానల్‌కు టీఎన్‌టీయూసీ మద్దతు

ధవళేశ్వరం, జూలై 15: ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న చల్లా శంకర్రావు ప్యానల్‌కు టీఎన్‌టీయూసీ మద్దతు ప్రకటించింది. మాజీ సర్పంచ్ పిన్నంటి ఏకబాబు నివాసంలో ఏర్పాటుచేసిన సమావేశంలో హార్లిక్స్ ఫ్యాక్టరీ టీఎన్‌టీయూసీ నాయకులు మాట్లాడుతూ శంకర్రావు ప్యానల్‌లో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజుకు అవకాశం లభించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఆ ప్యానల్ విజయానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో చప్పిడి ప్రసాద్, కట్టా నరసింహారావు, దేవి నాగేశ్వరరావు, గుత్తుల రమణ, పిన్నంటి ఏకబాబు, ఆళ్ల ఆనందరావు, నీటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కడియం ఆవ వ్యవసాయ పొలాల పరిశీలన

కడియం, జూలై 15: కడియం ఆవ ప్రాంతంలో ఉన్న వరి పొలాలను సోమవారం సాయంత్రం జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని రైతుల సమస్యలను ఆయనకు వివరించారు. ముంపునకు గురైన పొలాల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మాధవరావు తెలిపారు. నీరు పోయే ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ డి.శ్రీనివాసరెడ్డి, ఏవో కె.ద్వారకాదేవి, వ్యవసాయశాఖ సహాయకులు పాల్గొన్నారు.

సీతానగరం పీహెచ్‌సీకి డస్ట్‌బిన్లు అందజేత

సీతానగరం, జూలై 15: సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, గుమ్మళ్ళదొడ్డి పైప్‌లైన్ విభాగం చీపుర్లు, కర్రలు, డస్ట్‌బిన్లు ఉచితంగా అందజేసింది. స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కేంద్రానికి అందజేయడమే కాకుండా పీహెచ్‌సీ సిబ్బందితో కలసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఐవోసీఎల్ అధికారులు మిథున్‌కుమార్, వెంకటేష్, ప్రిన్స్‌కుమార్ సింగ్, సీహెచ్‌వో పి.వెంకటరత్నం, ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, సూపర్‌వైజర్లు సుధాకర్, దైవకృప, తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ఉపాధిహామీ గ్రామ సభలు

రాజానగరం, జూలై 15: ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీల నిర్వహణలో భాగంగా మండలంలో ఈ నెల 18 నుంచి 25వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఏపీవో ఏవీ రామారావు సోమవారం తెలిపారు. 18న తోకాడ, మల్లంపూడి, భూపాలపట్నం, 19న సీతారాంపురం, కొత్తతుంగపాడు, కొండగుంటూరు, 20న సంపత్‌నగరం 20న కలవచర్ల, సంపత్‌నగరం, నరేంద్రపురం, లాలాచెరువు, 21న చక్రద్వారబంధం, 22న ఫరిజెల్లిపేట, పాతతుంగపాడు, నామవరం, వెలుగుబంద, తూర్పుగోనగూడెం, 23న ముక్కినాడ, దివాన్‌చెరువు, 24న రాధేయపాలెం, కానవరం, 25న రామస్వామిపేట, నందరాడ, పుణ్యక్షేత్రం, శ్రీకృష్ణపట్నం, జి.యర్రంపాలెం, పల్లకడియం, పాలచర్ల, రాజానగరం గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయని, ఆయా గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు విధిగా హాజరుకావాలని ఏపీవో కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రాజానగరం, జూలై 15: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని చక్రద్వారబంధం కూటమి నాయకులు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. గ్రామ సచివాలయం, వెంకటనగరం పంపింగ్ స్కీమ్ కాలువ గట్టున, ఊరచెరువు గట్టున కొబ్బరి మొక్కలు నాటారు. వాటి పర్యవేక్షణ, పరిరక్షణకు ప్రత్యేక జాగ్రత్తలు చేపడతామని ఫీల్డ్ అసిస్టెంట్ కొత్తపల్లి శ్రీను తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

శాకాంబరిగా భ్రమరాంబిక



కడియం, జూలై 15: కడియం శ్రీభ్రమరాంబిక సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు భక్తులకు సోమవారం శాకాంబరిగా దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అర్చకులు, భక్తులు అమ్మవారిని సుందరంగా తీర్చిదిద్దారు. ప్రధానార్చకుడు అప్పలి శ్రీమన్నారాయణ ప్రత్యేక, కుంకుమ పూజలు నిర్వహించారు.

ఎన్టీఆర్ వైద్యసేవతో పేదలకు మెరుగైన వైద్యం

కడియం, జూలై 15:ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా పేదలకు మెరుగైన వైద్యంతో పాటు మాతాశిశు మరణాలు తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని కడియం సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో జేఎస్ఎస్‌కే పథకం, ఎన్టీఆర్ వైద్య పథకం ద్వారా వైద్యం పొందుతున్న రోగులకు ఉచిత ఆహార పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కలిదిండి విశాలాక్షి, కలిదిండి గోవిందు, మోసిగంటి ప్రసాద్, తుమ్మారాజు, జల్లి కృపారావు, తామెళ్ళ అయ్యప్ప, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్టూడెంట్స్ కిట్లు పంపిణీ

కడియం, జూలై 15: వేమగిరితోట జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యాకిట్లు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ నాయకుడు చెల్లుబోయిన శ్రీనివాస్, వాశంశెట్టి నాగబాబు, అప్పారి అన్నవరం, గుత్తుల కృష్ణ, పితాని శివరామకృష్ణ, కాండ్రేగుల సత్తిబాబు, జోగి చక్రవర్తి, హెచ్ఎం బీవీ ప్రకాష్ పాల్గొన్నారు.

కాలినడకన తిరుపతికి టీడీపీ నాయకులు

రంగంపేట, జూలై 15: సార్వత్రిక ఎన్నికల్లో అనపర్తి ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో మండలంలోని జి.దొంతమూరు టీడీపీ నాయకులు సింగన వెంకట సూర్యనారాయణ, బిల్లకుర్తి భాస్కరరావు, గల్లా సుబ్రహ్మణ్యం తిరుపతి వేంకటేశ్వరస్వామికి మొక్కు తీర్చుకోవడానికి సోమవారం కాలినడకన బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, జటప్రోలు వెంకటేశ్వరరావు, దుప్పలపూడి రాజేష్, ఉప సర్పంచ మెత్తన లోవకుమారి పాల్గొన్నారు.

బిక్కవోలు ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ నూతన కార్యవర్గం



బిక్కవోలు, జూలై 15: బిక్కవోలులో సోమవారం మండల ఫొటో అండ్ వీడియోగ్రఫీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. గౌరవాధ్యక్షుడిగా పి.సతీష్‌రెడ్డి, అధ్యక్షుడిగా ఎం.అశోక్, కార్యదర్శిగా జి.రఘు, కోశాధికారిగా వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడిగా శ్రీను, సహ కార్యదర్శిగా కృష్ణారెడ్డి, సహ కోశాధికారిగా అఖిల్‌ను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండలంలోని ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

సీతానగరం, జూలై 15: ప్రజా శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అన్నారు. పురుషోత్తపట్నం-రఘుదేవపురం రోడ్డు అధ్వానంగా ఉండి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పోలవరం కాంట్రాక్టర్‌తో మాట్లాడి తాత్కాలికంగా గ్రావెల్‌తో మరమ్మతులు చేపట్టారు. రోడ్డు దుస్థితిపై ప్రజల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో తాత్కాలికంగా గ్రావెల్‌తో గోతులు పూడ్చుతున్నారని వెంకటలక్ష్మి అన్నారు. త్వరలోనే రోడ్డుకు నిధులు మంజూరు చేయించి శాశ్వత పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో వలవల రాజా, పెందుర్తి అచ్యుతరామారావు, మట్ట వెంకటేశ్వరరావు, జనసేన వీరమహిళలు, కార్యకర్తలు, పాల్గొన్నారు

రైతుబజార్‌లో తూకం, నాణ్యతపై తనిఖీలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 15: రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ విపణిలో ధరల నియంత్రణకు సబ్సిడీ పై అందిస్తున్న బియ్యం, కందిపప్పు తదితర నిత్యావసరాలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా వినియోగదారుల మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు, సుంకర వీరశేఖర్ అన్నారు. జిల్లా సివిల్ సప్లయి అధికారి ఆదేశాల మేరకు సోమవారం రాజమహేంద్రవరం రైతు బజార్లలో తూకం,నాణ్యతపై తనిఖీలు చేశారు.

ఆర్డీవో కార్యాలయంలో ఆరు అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15: రాజమహేంద్రవరం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు వచ్చాయి. ఆర్డీవో ఏ.చైత్ర వర్షిణి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. దివ్యాంగుల పింఛను, మంచినీటి కుళాయి, డ్రైనేజీ, శానిటేషన్, రేషన్‌కార్డు మంజూరు తదితర అర్జీలను స్వీకరించారు.

నగరపాలక సంస్థకు 24 అర్జీలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 15: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ కమిషనర్ పీఎం సత్యవేణి నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 24 అర్జీలు స్వీకరించారు. వితంతువు పెన్షన్, డ్రైనేజీ సమస్యలు, ఇంటి పన్ను, వీధి దీపాల సమస్య, స్పీడ్ బ్రేకర్ వేయించాలనే ప్రజలు అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని సత్యవేణి తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ పాండురంగారావు, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



మంచినీళ్లివ్వాలంటే 54 పరీక్షలు చేయండి 7



నేటి నుంచి ఐదు చోట్ల టమోటాల విక్రయం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15 : బహిరంగ మార్కెట్లో టమోటా ధరలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ధరల నియంత్రణకు జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఆంధ్రజ్యోతిలో టమోటా తగ్గలే శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ స్పందించారు.బహిరంగ ప్రదేశాల్లోనూ రైతు బజార్లలోని ధరలకే ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ఈ మేరకు మార్కెటింగ్‌శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. మంగళవారం నుంచి రాజమహేంద్రవరంలోని మల్లయ్యపేట, ఏవీ అప్పారావు రోడ్డు, ప్రకాష్‌నగర్, స్టేడియం రోడ్డు, బొమ్మూరు ప్రాంతాల్లో టమోటా విక్రయాలకు అవుట్‌లెట్స్ ఏర్పాటు చేస్తున్నామని జిల్లా మార్కెటింగ్‌శాఖ సహాయ సంచాలకుడు ఎం.సునీల్ వినయ్ తెలిపారు. నగరంలోని ఐదు బహిరంగ ప్రదేశాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. బహిరంగ మార్కెట్లో ధరలు నియంత్రణలోకి వచ్చే వరకూ ఈ ప్రత్యేక కౌంటర్లు కొనసాగిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఎన్నికల్లో విజయం తర్వాత జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళగిరి జనసేన కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యేలను సత్కరించారు.. దీనిలో భాగంగా జిల్లాలోని నిడదవోలు నియోజకవర్గం నుంచి ఎన్నికై మంత్రిగా ఉన్న కందుల దుర్గేష్, రాజానగరం నియోజకవర్గం నుంచి ఎన్నికైన బత్తుల బలరామకృష్ణలను సత్కరించారు.

మంత్రిగారి ఇలాఖాలో ఓకే..

నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో అపారిశుధ్యంపై "మంత్రిగారి ఇలాఖాలోనూ ఇంతే" శీర్షికన ఆంధ్రజ్యోతిలో గత శుక్రవారం ప్రచురితమైన కథమైన అధికారులు స్పందించారు.. శనివారం డీపీవో సమిశ్రగూడెం గ్రామాన్ని సందర్శించి పారిశుధ్యం మెరుగుపర్చాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా సోమవారం పంచాయతీ సిబ్బంది రంగంలోకి దిగారు..వేగంగా పనులు చేయిస్తున్నారు. ఈ మేరకు అమరావతి నుంచి మంత్రి కందుల దుర్గేష్ డ్రెయి నేజీ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో కూడా సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. - నిడదవోలు





రూరల్ తహశీల్దార్ కార్యాలయం
ఈ నెల 4వరకూ పేరులేని అటెండెన్స్ రిజిష్టర్

ఇదేమి..వెంకటేశా!

- రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ
- డిప్యూటేషన్ లేకుండానే కలెక్టరేట్‌లో పని
- అటెండెన్స్ రిజిస్టర్‌లోనూ నమోదుకాని పేరు
- గత కలెక్టర్ వద్ద సీసీగా చెలాయింపు
- మాధవీలత బదిలీతో మాయం?

రాజమహేంద్రవరం రూరల్, జూలై 15 : ఆయన చెప్పిందే వేదం.. చేసిందే చట్టం..అడిగింది ఇవ్వాల్సిందే.. చెప్పింది చేయాల్సిందే.. ఇదెవరో ఉన్నతాధికారి గురించి కాదండోయ్.. గత కలెక్టర్ మాధవీలత వద్ద సీసీగా పని చేసిన ఒక ఉద్యోగి పెత్తనం.. అయితే కలెక్టర్ మాధవీలత బదిలీకావడంతో సదరు సీసీ ఖాళీ అయిపోయారు.. ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో.. ఏమైపోయారో తెలియదు. పరిపాలనా సౌలభ్యం కోసం కొంత మంది ఉద్యోగులను డిప్యుటేషన్‌పై మరొక చోటుకు పంపిస్తుంటారు. సంబంధిత ఉద్యోగి పేరెంట్ డిపార్టుమెంట్ ద్వారా జీత భత్యాలు తీసుకుంటాడు. అదంతా ప్రొసీజరు ప్రకారం జరుగుతుంది. అయితే ఇక్కడ మాత్రం అలాంటిదేమీ లేదు. రాజమహేంద్రవరం రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో వెంకటేష్ చాలా కాలం కిందట రెవెన్యూ అధికారిగా జాయిన్ అయ్యాడు. అయితే జాయిన్ అయిన రోజునే కార్యాలయానికి వచ్చాడు.. ఆ తరువాత నుంచి రాలేదు.. అప్పటి నుంచి కలెక్టరు మాధవీలత సీసీనంటూ చెబుతుండేవాడు. అయితే కార్యాలయానికి ఎటువంటి డిప్యుటేషన్ ఆర్డరు అందకపోవడంతో రూరల్ తహశీల్దార్ కార్యాలయ అధికారులు అయోమయానికి గురయ్యారు. కనీసం అటెండెన్స్ రిజిస్టరులో ఆ ఉద్యోగి పేరు కూడా నమోదు చేయలేదు. కాని జీతం మాత్రం ఈ కార్యాలయం నుంచే వెళుతోంది.ఎలాంటి అధికారి అయినా డిప్యుటేషన్‌పై మరొక కార్యాలయానికి వెళితే వారు జీతం తీసుకునే కార్యాలయంలో ఉండే అటెండెన్స్ రిజిస్టరులో ఆ ఉద్యోగి పేరు నమోదు చేసి డిప్యుటేషన్ వివరాలను రెడ్ మార్క్ చేస్తారు. అలాంటి రూల్స్ ఇక్కడ కనిపించవు.ఇదీ రాజమహేంద్రవరం రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయంలో పరిస్థితి.. ఆ ఉద్యోగి పేరు వెంకటేష్. హోదా ఆర్ఐ.. పనిచేసేది జిల్లా కలెక్టరేట్‌లో ఉన్నత స్థాయి అధికారి వద్ద సీసీనంటూ చక్రం తిప్పుతూ అధికారులను బెదిరిస్తూ కాలం వెళ్లబుచ్చుకుంటూ పలు అక్రమాలకు పాల్పడ్డాడంటూ పలువురు అధికారులు చెబుతున్నారు. ఏపని కోసమైనా గత కలెక్టరు మాధవీలతను కలవాలంటే ఈ అనధికార సీసీని ప్రసన్న చేసుకోవాల్సి వచ్చేదని పలువురు జిల్లా అధికారులు చెప్పడం గమనార్హం.

అన్నీ తానై..?

రూరల్ తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ లేకపోవడంతో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ అంతా తానై వ్యవహరించినట్టు సమాచారం. ధవళేశ్వరం గ్రామ వీఆర్‌వో సహాయంతో ఆర్ఐ విధులు నిర్వహించేవారని తెలిసింది. మండల పరిధిలోని అన్నిరకాల రెవెన్యూ సర్వీసులు, ముఖ్యంగా ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్లు మొదలు, భూములకు సంబంధించి మ్యుటేషన్స్ వరకు తానొక్కడే చేస్తూ గ్రామ వీఆర్‌వోలను ఆదేశిస్తూ పలు భూరికార్డులను టాంపరింగ్ చేయడంతో పాటు పలువురికి లబ్ధి చేకూర్చారంటూ ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారమంతా గత కలెక్టరేట్ వద్ద సీసీగా విధులు నిర్వహించిన వెంకటేష్ మేనేజ్ చేస్తుండేవాడని సమాచారం. దీనిపై తహశీల్దార్‌ను వివరణ కోరగా గత కలెక్టర్ మాధవీలత బదిలీ కావడంతో ఈ నెల 5వ తేదీన ఆఫీస్‌కు వచ్చి లీవ్ లెటర్ ఇచ్చి వెళ్లినట్టు చెప్పారు.



మాయాషాఢం!

ఆషాఢం..ఆఫర్ల వల



తూకంలో చీరల అమ్మకం అతి తక్కువ ధరలకే..

90 శాతం.. 80 శాతం..70 శాతం..60 శాతం.. ఫ్లాట్ డిస్కౌంట్.. చివరకు ఎంత కొంటే అంత ఉచితం.. జిల్లా వ్యాప్తంగా వస్త్ర దుకాణాల వద్ద ప్రస్తుతం కనిపిస్తున్న బోర్డులివి.. జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో ఇది మరికాస్త ఎక్కువ.. ఎందుకంటే ఒకటా రెండా సుమారుగా వెయ్యి వస్త్ర దుకాణాలు ఉంటాయి.. భలే ఉందిలే ఆఫర్ అని షాపులో అడుగుపెట్టామా ఇక అంతే సంగతి.. అవగాహన లేకపోతే జేబు ఖాళీయే.. ఆషాఢం ముసుగులో సాగే మోసం అంతా ఇంతా కాదు..

ఎవరైనా రూ.100కి కొని రూ.40కి విక్రయిస్తారా? కచ్చితంగా జరగదు. మరి ఈ డిస్కౌంట్ల మేళా ఏమిటి? అంటే అదో పెద్ద మోళీ. వినియోగదారులను దుకాణంలోకి రప్పించడమే లక్ష్యంగా డిస్కౌంటు బోర్డులు తగిలిస్తారు. లోపలకు వెళ్లాక డిస్కౌంటు ధరల వస్త్రాలు చూస్తే నీరసమొస్తుంది. పెద్దగా బాగోనివి, సేల్స్ లేని ఐటమ్స్, డ్యామేజీలు ఉన్నవి, పాత స్టాకు గుట్టలుగా పోస్తారు. డిస్కౌంటుకు ఆశపడి వెళ్లిన వారిలో సుమారు 90శాతం మందికి ఇవి నచ్చవు. వెంటనే పక్కనే ఉన్న వస్త్రాలను చూస్తారు. వాటికి ఒక్క రూపాయి డిస్కౌంటు కూడా ఇవ్వరు. మరో షాపునకు వెళ్లినా ఇదే తతంగం కావడంతో డిస్కౌంటు కోసం వెళ్లిన వాళ్లు ఏ డిస్కౌంటూ లేని దుస్తులను కొనక తప్పదు. ఇదే అదనుగా వీటి ధరలపై బాదుడే.. బాదుడు..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఆషాఢం వచ్చిందంటే మోళీ మొదలైపోతోంది. ఎడాపెడా ఎడతెరిపి లేని రాయితీలే. ఓ రూపాయి మిగులుతుందనే అమాయక జనం ఆశను ఆసరాగా చేసుకొని దగా చేయడం పరిపాటిగా మారిపోయింది. ఉభయగోదావరి జిల్లాలకు రాజమహేంద్రవరమే అతి పెద్ద మార్కెట్. ఇక్కడ సుమారు వెయ్యి వరకూ చిన్నా పెద్దా వస్త్ర దుకాణాలు ఉంటాయి. వీటిలో 20 వరకూ పెద్ద పెద్ద మాల్స్ 50 వరకూ భారీ దుకాణాలు ఉన్నాయి. ఏ సీజన్ అయినా ప్రతి రోజూ కోట్లలో వ్యాపారం సాగుతోంది. అయితే అషాఢం సీజన్‌లో ఇది మరింత ఎక్కువ ఉంటుంది. ఎందుకంటే చీరకు కారు ఫ్రీ అన్న డైలాగు విన్నారా?.. అలాగే ఏకంగా 80 శాతం రాయితీ కూడా ఇచ్చేస్తున్నామంటూ వ్యాపారులు ప్రచారాలతో ఊదరగొడుతున్నారు. గతంలో ఈ మోసంలో కూడా కాస్త నిజాయితీ ఉండేది. డ్యామేజీ అయినవి, పాత స్టాకు వంటి వాటిని ఆషాఢం ధమాకా పేరుతో రేటు తగ్గించి వదిలించుకునేవారు.కానీ కొన్నేళ్లుగా ప్లాట్‌ఫాంపై సరుకు కూడా మిరుమిట్లు గొలిపే లైటింగ్ మధ్య అద్దాల దుకాణాల్లో దర్శనమిస్తోంది. సందట్లో సడేమియా మాదిరిగా పెద్ద బ్రాండ్ల పేరుతో నకిలీలను అంటగడుతున్నారు.కిలోల తూకం అంటూ టన్నుల్లో మోసగిస్తున్నారు. అయితే మరో ఆషాడం రాకుండానే వాటి మన్నిక వెక్కిరిస్తోంది. కానీ, 'డిస్కౌంట్' మాట చెవిన పడగానే జనం ఎగబడడం మాత్రం సాధారణంగా మారిపోయింది. ఈ మోసపు వేషాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

నాడు క్లియరెన్స్..నేడు డిస్కౌంట్

ఆషాఢమాసం వచ్చిందంటే 'ఆషాఢం డిస్కౌంట్ సేల్' అనే బోర్డులు దాదాపు అన్ని దుకాణాల వద్ద చూస్తుంటాం. ఆషాఢంలో దుకాణాల్లో పెద్దగా వ్యాపారాలు సాగవు. దీంతో బేరాలు పెరగడానికి డిస్కౌంట్లు పెడుతుంటారు. అదే ప్రస్తుతం వ్యాపారులకు కలిసొచ్చింది. కొనేళ్ల కిందట డిస్కౌంట్లు కాస్త సహేతుకంగా సాగేవి. ఆషాఢంలో పాత స్టాకును క్లియర్ చేసుకునేవారు. కానీ రాను రాను ఆషాడం సేల్స్ అంటే మోసానికి నిదర్శనంగా మారిపోయింది.అసలు ధరలను ఇష్టానుసారం వేస్తూ తగ్గింపును భారీగా చూపించి ప్లాట్‌ఫాం సరుకు పెద్ద దుకాణాల్లో విక్రయిస్తున్నారు.పేద, మధ్య తరగతి జీవులు డిస్కౌంట్‌ను ఎక్కువగా కోరుకుంటారు. ఇదే అదనుగా దుకాణాలూ మోసాలకు ఆషాడాన్ని ఎంచుకున్నాయి. క్లియరెన్స్ సేల్..డిస్కౌంట్ ధమాకాగా మారిపోయింది.

అసలు ధర ఎంతబ్బా?

వస్త్రాలు, చెప్పులు, బూట్లు వంటి వాటి అసలు ధరలు చెప్పడం ఎవరి తరమూ కాదు. వ్యాపారులు ఎంతకు హోల్‌సేల్‌గా కొంటున్నారో.. వాటికి రవాణా తదితర ఖర్చులతో కలిపి ధర ఎంత నిర్ణయించాలో అనే సహేతుకత లేదు ధరల నిర్ణయం, తనిఖీల్లో ప్రభుత్వ యంత్రాంగం పాత్ర అంతంత మాత్రమే. దీంతో ధరలను ఇష్టానుసారం వేస్తుంటారు. ఉదాహరణకు ఒక చీర ధర రూ.5 వేలు చూపించి 60 శాతం డిస్కౌంట్ అంటూ రూ.3 వేలు మినహాయించామని, రూ.2 వేలకే రూ.5 వేల విలువ చేసే చీర ఉదారంగా ఇస్తున్నామంటారు.కానీ అసలు ఆ చీర ఖరీదు రూ.5 వేలు ఉంటుందా? అంత విలువ చేస్తుందా? అనే విషయాలకు ఎవరూ సమాధానం చెప్పలేరు.రూ.200 చీర ధర రూ.5 వేలు అన్నా ఏం చేయలేం.వాస్తవానికి ఎంఆర్పీ అంటే గరిష్ఠ చిల్లర ధర. వ్యాపారులు దీనిని చూపించి తగ్గించడం కుదరదంటూ బురిడీ కొట్టిస్తారు.ఎంఆర్పీపై బేరమాడే వెసులుబాటు వినియోగదారుడికి ఉంది.ఎంఆర్పీపై తగ్గింపును కోరవచ్చు.



ఆఫర్‌లో పెట్టిన ఫైలా షూ

విచక్షణే ఆయుధం

డిస్కౌంట్ల మోళీలో చిక్కుకొని పేద, మధ్య తరగతి ప్రజానీకం ఎక్కువగా మోసపోతున్నారు. ధరల నిర్ణయంలో సహేతుకత లేకపోవడం.. విధివిధానాలు అసలే ఉండకపోవడం మోసానికి కొమ్ముకాస్తున్నాయి. ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొడుతున్నా.. ఆన్‌లైన్ పేమెంట్లు ప్రోత్సహించకుండా నగదు తీసుకుంటూ నల్లధనానికి ఊతమిస్తున్నా అధికారులకు పట్టదు. ఇక ధరల నియంత్రణ ఊసే లేదు. ఈ దుస్థితిలో వినియోగదారులే తమ విచక్షణకు పదును పెట్టాల్సి ఉంది. ఆషాఢం సేల్ వచ్చేసిందంటూ పరుగులు పెట్టకుండా వస్తువుల మన్నిక, డబ్బుకు తగిన సరుకు వస్తుందా! అనే విషయాలను గమనించుకోవాలి. డిస్కౌంట్‌లో అతి తక్కువ ధరకే వచ్చిందని సంబరపడితే కొద్ది రోజుల్లో చీకిపోవడం, చిరిగిపోవడం, రంగు వెలిసిపోవడం జరుగుతుంటాయి.ఒక్క ఉతుక్కే పనికి రాకుండా పోతాయి. అప్పుడు డబ్బులు అనవసరంగా పోగొట్టుకున్నామన్న వేదనే మిగులుతుంది.బ్రాండ్ల పేరుతోనూ బురిడీ కొట్టిస్తున్నారు. ప్రముఖ కంపెనీ వస్త్రాలు, బ్యాగులు, బూట్లు, చెప్పులు, హ్యాండు బ్యాగులు, డోర్ మ్యాట్‌లు అంటూ జనాలను మోసగిస్తున్నారు. ఓ ప్రముఖ కంపెనీ ఎంబ్లమ్(చిహ్నం)తో ఉండే టాప్‌లు, హ్యాండ్‌బ్యాగ్, షూ వంటి వాటిపై వేలల్లో ఎంఆర్పీ పెడుతున్నారు. ఏకంగా 70 శాతం డిస్కౌంట్ ధరకే ఇస్తున్నామని మోసగిస్తున్నారు.ఉదాహరణకు ఒక బ్రాండెడ్ షూ ధర రూ.10 వేలు ఎంఆర్పీ చూపించి 70 శాతం డిస్కౌంట్ అంటున్నారు. అంటే రూ.3 వేలకే బ్రాండెడ్ షూ వస్తుందని వినియోగదారుడు ఆశ పడుతున్నాడు. కానీ అది నకిలీ అని తెలుసుకోలేకపోతున్నారు. వాస్తవానికి ఆ షూ ధర రూ.500 ఉండకపోవచ్చు. అసలు బ్రాండెడ్ వస్తువులకు 60, 70, 80 శాతం డిస్కౌంట్ ఇస్తారా? అనే ఆలోచన జనాల్లో ఏమైందనేది ఓ పెద్ద ప్రశ్నగానే ఉంటోంది. మనకు రూ.2 వేలకు ఇస్తున్నారంటే వ్యాపారులకు హోల్‌సేల్‌గా ఎంత ధరకు వచ్చి ఉండాలి. దానికి లాభం, రవాణా, సిబ్బంది జీతాలు, వసతి, అద్దెలు వంటివి కలిపితే ఎంత అవుతుంది?.. ఇలా ఒక్కసారి లెక్కవేసి చూడండి.. మోళీ మీకే తెలిసిపోతుంది. అతి చిన్న తేడాలతో అసలైన బ్రాండుకు అతి దగ్గరగా ఎంబ్లమ్‌లను ప్రింట్ చేస్తుండడంతో వినియోగదారులు పసిగట్టలేకపోతున్నారు. సెల్‌ఫోన్‌లో సెర్చ్ చేసి నకిలీకి, అసలుకు తేడా తెలుసుకోవచ్చు. కానీ నకిలీని కూడా వేల రూపాయలు పెట్టి కొంటున్నారు. ఎంఆర్పీపై డిస్కౌంట్ ఎంత ఇస్తున్నారని చూసి మురిసిపోయే ముందు అసలు ఆ వస్తువు విలువకు ఎంఆర్పీ ధరకు పొంతన కుదురుతుందా అనే విషయాన్ని పరిశీలించడం బెటర్.

- మార్కెట్‌లో డిస్కౌంట్ల మేళా
- ఒకటి కొంటే ఒకటి ఉచితం
- చీరలు ఒక కిలో రూ.వెయ్యి
- ఎంత కొంటే అంత ఫ్రీ
- ఎగబడుతున్న జనం
- మోసపోతున్న వైనం
- పట్టని అధికార గణం
- రాజమండ్రిలో భారీగా షాపులు
- గోదావరి జిల్లాలకు మార్కెట్
- రోజూ కోట్లలో వ్యాపారం



రాజమహేంద్రవరంలోని ఒక వస్త్రదుకాణంలో ఇలా..



ముత్యాలమ్మకు.. బంగారం నిలువు దోపిడీ

చాగల్లు, జూలై 15: కోరిన కోర్కెలు తీర్చడంతో మండలంలోని నెలటూరు గ్రామదేవత శ్రీముత్యాలమ్మకు ఒక ముత్తయిదువ బంగారం నిలువు దోపిడీ సమర్పించుకుంది. సుమారు పదకొండున్నర కాసుల బంగారు ఆభరణాలు, 46 గ్రాముల వెండి ఆభరణాలు కరిగించి కనికలుగా మార్చి అమ్మవారికి సమర్పించారు. ఇదిలా ఉండగా భక్తులు ఆషాఢ మాస సారె కావిళ్ల సమర్పించి ముత్తయిదువులు మొక్కులు చెల్లించుకున్నారు. పలు రకాల తీపి పదార్థాలను గ్రామస్తులు సోమవారం కావిళ్లతో సారెగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. బాణసంచా కాలుస్తూ, డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, 300 మంది ముత్తయిదువులు పాల్గొన్నారు.

ఇసుకా లేదు.. ఉచిత విద్య లేదు..



మీ సమస్యలన్నీ పరిష్కరిస్తా : అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ ప్రశాంతి

- జనంతో కిటకిటలాడిన కలెక్టరేట్
- సమస్యల పరిష్కార వేదికకు హాజరు
- 121 అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- పలు సమస్యలపై విన్నపాలు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, జూలై 15 : ఇసుక సరఫరాకు ఇబ్బందులు తప్పడంలేదని పలువురు కలెక్టర్ ఎదుట వాపోయారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక అర్జీదారులతో కిటకిటలాడింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఇన్‌చార్జి జేసీ దినేష్ కుమార్, డీఆర్‌వో నరసింహులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురు లారీ ఓనర్ కం డ్రైవర్లు కలెక్టర్‌ను కలిసి ఇసుక ట్రాన్స్‌పోర్టులో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. ఇసుక కావాల్సిన వినియోగదారుల ప్లాన్ అప్రూవల్స్, ఆధార్ కార్డులు తీసుకుని పంచాయతీ కార్యదర్శుల వద్దకు వెళుతుంటే వారు వాటిని ధ్రువీకరించడానికి పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదన్నారు.సమస్యను పరిష్కరించాలని కోరారు. చాలా మంది దివ్యాంగులు తమ అంగ వైకల్యం 80 నుంచి 90 శాతం ఉందని.. ప్రస్తుతం ఇస్తున్న పింఛను రూ.15 వేలకు మార్చుచేయాలని కోరారు. విద్యాహక్కు చట్టం కింద కార్పొరేట్ స్కూల్స్‌లో 25 శాతం సీట్లు ఉచితంగా పేద,మధ్య తరగతి కుటుంబాలకు ఇవ్వాలని..కానీ రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో పలు కార్పొరేట్ స్కూల్స్‌లో ఉచిత సీట్ల కేటాయింపుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫ్రీ ఎడ్యుకేషన్ స్టూడెంట్స్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొంత మంది తల్లిదండ్రులు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. శ్రీగౌతమి పాఠశాలలో 34 మందికి సీట్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం ఆరుగురికి మాత్రమే సీట్లు ఇచ్చి మిగిలిన వారికి నిరాకరించారన్నారు. ధవళేశ్వరంలోని ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ సంఘ సభ్యులు ప్రమోద్ కుమార్, పాస్టర్ జి.కిరణ్ బాబు తదితరులు కలెక్టర్‌ను కలిసి తమ చర్చిలో పరిస్థితిని చక్కదిద్దాలని విజ్ఞప్తి చేశారు. ధవళేశ్వరం ఎర్రకొండకు చెందిన తల్లాడ ఉమ తన కుమారుడు సాయికుమార్ 2019 నుంచి కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు పట్టించుకోలేదని అర్జీ పెట్టారు.ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మొత్తం 121 అర్జీల ను కలెక్టర్ స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహిం చిన గ్రీవెన్స్‌కి 21 ఫిర్యాదులు అందాయి. అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్ రాజు ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలను తెలుసు కున్నారు.కార్యక్రమంలో టూరిజం జేడీ వి.స్వామినాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు టి.రాధిక,ఆర్డీవో కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15 : గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ (పీసీ పీఎన్ డీటీ యాక్టు) అమలుపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, వివరాలు కోరినా శిక్షార్హులేనని హెచ్చరించారు. జిల్లాలో స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై ఆకస్మిక తనిఖీలు చేసే విధంగా నిఘా వ్యవస్థ పెంచాలన్నారు. జిల్లాలో లింగ నిష్పత్తి సంఖ్య 800 కంటే తక్కువగా ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను సందర్శించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ ఏడాది జరిగిన ప్రసవాల లింగ నిష్పత్తి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, వైద్యాధికారులుపాల్గొన్నారు.

విమానాశ్రయ పరిరక్షణకు చర్యలు చేపట్టండి

ఎయిర్‌ఫీల్డ్ పర్యావరణ నిర్వహణ కమిటీ సమావేశంలో కలెక్టర్

రాజమహేంద్రవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం విమానాశ్రయంలోని ఫ్లయింగ్ జోన్‌లో పక్షులు, కోతులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ఎయిర్‌ఫీల్డ్ పర్యావరణ నిర్వహణ కమిటీ సమావేశంలో మాట్లాడారు. విమానాశ్రయంలో వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు రెండు ప్రతిపాదనలు సిద్ధం చేసి రెండు రోజుల్లోగా నివేదిక అందజేయాలని ఆదేశించారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం విశిష్టతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విమానాశ్రయ పరిసరాల్లో నిబంధనలు పాటించని భవన నిర్మాణాలపై చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి జేసీ కె.దినేష్‌కుమార్,ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు,ఆర్డీవో ఎ. చైత్రవర్షిణి,డీఆర్వో జి.నరసింహులు, ఏసీపీ అడ్మిన్ ఎస్ఆర్ రాజశేఖర రాజు, అటవీఅధికారి బి.నాగరాజు, డీఎంహెచ్‌వో వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పదో తరగతోడి పవరేంటో చూపిస్తా

రాజానగరంలో వైసీపీ అవినీతి పెకలిస్తా : బత్తుల

కోరుకొండ,జూలై 15 : గతంలో ఎంపీటీసీ స్థాయి వాడు నాకు పోటీనా అని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఇతర వైసీపీ నాయకులు ఎద్దేవా చేశారని.. ఎమ్మెల్యేగా గెలిచి చూపించానని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. కోరుకొండలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పుడు మరలా పదో తరగతోడు ఏం చేస్తాడులే అంటూ సెటైర్లు వేస్తున్నారని.. ఆ పదోతరగతోడి పవరేంటో తొందరలోనే చూపిస్తానని.. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజానగరంలో జరిగిన అవినీతిని కూకటి వేళ్లతో పెకలిస్తానని శపథం చేశారు. తన స్వగ్రామం గాదరాడలో 10వ తరగతి ఫెయిలైనా ఆ తరువాత బీకాం కోర్సులో జాయినై ద్వితీయ సంవత్సరంలో డిస్ కంటిన్యూ చేశానన్నారు. తరువాత హైదరాబాద్‌లోని ఇంగ్లీషు అండ్ ఫారన్ లాంగ్వేజెస్ కోర్సులో జాయినై ఇంగ్లీషులో మాట్లాడడం, రాయడం, చదవడం అభ్యసించానన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేటప్పుడు అఫిడవిట్‌లో రాయాలి కాబట్టి 9వ తరగతి పాస్ అని రాశానన్నారు. సర్టిఫికెట్ లేకపోయినా తనకు నాలెడ్జ్ ఉందన్నారు. గత వైసీపీ పాలనలో రాజానగరం నియోజకవర్గంలో ఎవరెవరు ఏం చేశారో.. బినామీల పేరుతో ఏం వ్యవహారాలు నడిపారో తనకు తెలుసన్నారు. మాటల ద్వారా కాదు.. చేతుల ద్వారా చేసిచూపిస్తానని బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

మాజీ ఎమ్మెల్యే శేషారావు పుట్టినరోజు


ఉండ్రాజవరం: వెలగదుర్రులో శేషారావు పుట్టినరోజు వేడుకలు

నిడదవోలు, జూలై 15: నిడదవోలులోని టీడీపీ కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరుగుపల్లి శేషారావు పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. వేలివెన్ను ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో తిరుపతి సత్యనారాయణ, వెలగన సూర్యారావు, బైపే రాజేశ్వరరావు తదితర్లు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రులో తెలుగుదేశం, జనసేన పార్టీల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో శేషారావు కటౌట్ ఆకారంలో తయారు చేసిన 59 కిలోల కేక్‌ను కట్ చేశారు. బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, వేలివెన్ను ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, ముదునూరి రవీంద్రరాజు, పాతూరి నరేంద్ర పాల్గొన్నారు.

దుర్గాభాయి దేశ్‌ముఖ్ జయంతి

తాళ్లపూడి, జూలై 15: మండలంలోని రాగోలపల్లి ప్రాథమిక పాఠశాలలో దుర్గాభాయి దేశ్‌ముఖ్ జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాభాయి చిత్రపటానికి విద్యార్థులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దుర్గారావు మాట్లాడుతూ దుర్గాబాయి 1909 జూలై 15న రాజమండ్రిలో జన్మించారని ఆమె విద్యాభ్యాసం అనంతరం అక్కడే బాలికా హిందీ పాఠశాలను నెలకొల్పారన్నారు. గాంధీజీ చేపట్టిన ఉప్పు సత్యాగ్రహంలో మహిళలు పాల్గొనుటలో ఆమె కీలక పాత్ర వహించారన్నారు. ఎన్నో స్వచ్ఛంద సంస్థలను స్థాపించి సంఘసంస్కర్తగా పేరొందారని హెచ్‌ఎం చెప్పారు.

రోగులకు పౌష్టికాహారం అందజేత

నిడదవోలు, జూలై 15: రోటరీ క్లబ్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని క్లబ్ అధ్యక్షుడు కొర్లేపర వెంకటరత్నకుమార్ అన్నారు. సోమవారం నిడదవోలులోని ప్రభుత్వాసుపత్రిలో కారింకి పల్లారావు జ్ఞాపకార్థం కారింకి సాయిబాబా ఆర్థిక సహకారంతో రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి అనంతపల్లి కృష్ణ చైతన్య, మీసాల ప్రసాద్, చిక్కాల రాజా, కేదారిశెట్టి రవికుమార్, సుబ్బారావు తదితర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో మోటార్ బోరు కేబుళ్ల చోరీ

ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

వ్యవసాయ పనులు కుంటుపడుతున్నాయని రైతుల ఆవేదన



నల్లజర్ల, జూలై 15: మండలంలోని పలు గ్రామాల్లో మోటార్ బోరు కేబుళ్ల చోరీకి గురౌతున్నాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటి వరకు మండలంలో 50 బోర్ కేబుళ్లు చోరీకి గురైనా పోలీసులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి సింగరాజుపాలెం, ముసుళ్ళకుంట గ్రామాల్లో 10మోటార్ బోరుల వద్ద కేబుళ్లు, రాగితో ఉన్న ఫ్యూజులు చోరీకి గురైనట్టు రైతులు చెబుతున్నారు. వరి నాట్లు వేసి వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్న సమయంలో దుండగులు కేబుళ్ల చోరీ చేయడంతో పనులు కుంటుపడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు విల్లి నారాయణ, నందమూరి రామకృష్ణ, కానుబోయిన ఫరీర్ చెబుతున్నారు.

విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందజేత


దేవరపల్లిలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందజేస్తున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, జూలై 15: ప్రభుత్వం అందించే అన్ని మౌలిక సదుపాయాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. దేవరపల్లి జడ్పీ హైస్కూల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన విచ్చేసి విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. విద్యాశాఖాధికారులు ఎం.తిరుమలదాసు, అప్పారావు మాట్లాడుతూ మండలంలోని 5233 మంది విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, జడ్పీటీసీ స్వర్ణలత, సర్పంచ్ కడిమి వీరకుమారి, నాయకులు రాంబాబు, కంబాల సత్తిబాబు, సూరిశెట్టి బాలు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పొలాల పరిశీలన


నీటమునిగిన వరిచేలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

గోపాలపురం, జూలై 15: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు నీటమునిగిన వరి పొలాలను అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ముంపు భారీనపడిన నాట్లకు తీసుకోవల్సిన జాగ్రత్తలను సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, వనజాక్షి, కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్, ఎంఈఓ రాజారావు, వీఆర్వో శ్రీను, వీఏఏవీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న వ్యాన్

వ్యాన్‌లో ఇరుక్కుపోయిన యువకుడు.. తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ యువకుడు

నల్లజర్ల, జూలై 15: మండలంలోని పుల్లలపాడు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళుతున్న టాటా ఏస్ వ్యాన్‌లో రాజానగరం వద్ద ఒక యువకుడు ఏలూరు వరకు వస్తానని ఎక్కాడు. పుల్లలపాడు వద్ద దాబా నుంచి బైపాస్ ఎక్కుతున్న లారీని వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో వ్యాన్ ఎక్కిన యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వాహనంలో ఇరుక్కుపోవడంతో స్థానికులు ఇనుపరాడ్లు ఉపయోగించి బలవంతంగా బయటకు తీసి అంబులెన్స్‌లో ఏలూరు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం విడయవాడకు తరలించారు. యువకుడు వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15: డిగ్రీ ప్రవేశాలపై రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సును ఎత్తివేస్తున్నట్టు తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సును చదవడానికి ఇష్టపడతారన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. ఈనెల 10నుంచి డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనా వెబ్‌సైట్‌లో బీకాం జనరల్ ఆప్షన్ కనిపించకపోవడం, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సు కనిపించడంతో విద్యార్థులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని బీకాం జనరల్ కోర్సు కొనసాగించాలన్నారు.

ముగిసిన వారాహి నవరాత్రులు

బిక్కవోలు, జూలై 15: కొంకుదురులో తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిసాయి. అర్చకులు రమణశర్మ ఇంట కలశ స్థాపన చేసిన పారాయణ బృందం ప్రతిరోజూ సాయంత్రం లలితా సహస్రనామం, శ్రీదేవి ఖడ్గమాల, వారాహి స్తుతి, చండీ సప్తశతులను పారాయణం చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా వారాహిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కొవ్వాడ నీటి సమస్య పరిష్కారానికి కృషి

» ఎమ్మెల్యే ముప్పిడి.. తిరుగుడుమెట్ట, పెద్దేవం గ్రామాల్లో పర్యటన


నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, జూలై 15: గత ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేసాయని దాని ఫలితమే నేడు కొవ్వాడ నీటితో పంట పొలాలు మునిగాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తిరుగుడుమెట్ట, పెద్దేవం గ్రామాల రైతుల కోరిక మేరకు ఆయన కొవ్వాడ నీటితో మునిగిన పంట పొలాలను పరిశీలించేందుకు సోమవారం తిరుగుడుమెట్ట విచ్చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ శాఖాధికారులతో ముంపు సమస్యపై చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రైతుల సమస్య పరిష్కారానికి త్వరలో పనులు చేపడతామని, ముంపునీరు తీసేవరకూ పనులు చేసే అవకాశం లేనందున కొవ్వాడ పరిధిలోకి వచ్చే ప్రాంతాన్ని సర్వే చేయించి ఆక్రమణల తొలిగించి శాశ్వత పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో అన్నమరెడ్డి సత్తిబాబు, రమణ, పోతుల దుర్గా ప్రసాదు, అల్లూరి రాంబాబు, ఏసేలంక తాతారావు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పీఎంపీల సేవలు అభినందనీయం

కొవ్వూరు, జూలై 15: గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యసేవలందిస్తున్న పీఎంపీల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ కళ్యాణ మండపంలో సోమవారం జరిగిన పీఎంపీల అసోసియేషన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. పీఎంపీలకు వ్యక్తిగత, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, పీఎంపీల సంఘం రాష్ట్రాధ్యక్షుడు శివరామకృష్ణ, వెంకటరత్నం పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 అర్జీలు


కొవ్వూరులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ

» సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు, జూలై 15: కొవ్వూరు డివిజన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 10 ఫిర్యాదులు స్వీకరించినట్టు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొవ్వూరు మండలం పెనకనమెట్టలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, అక్రమాలకు పాల్పడుతున్నాడని విచారణ జరిపి శాఖపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అలాగే పలు మండలాల నుంచి వచ్చిన వారి నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

ముంపు నివారణకు చర్యలు చేపట్టండి

నిడదవోలు, జూలై 15: నిడదవోలు మండలం శింగవరంలో పంట పొలాలు వర్షం నీటికి మునిగిపోతున్నాయని, ముంపు నివారణకు చర్యలు చేపట్టాలంటూ సోమవారం తహశీల్దార్ వి.నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ చాగల్లు మండలం ఊనగట్ల, కలవలపల్లి, బ్రాహ్మణగూడెం గ్రామాల మీదుగా కోటసత్తెమ్మ దేవాలయం వెనుక నుంచి వస్తున్న మురుగునీరు శింగవరం, నిడదవోలులోని పంటపొలాలను ముంచుతోందని, పూర్వం ఉన్న బ్రాంచి కెనాల్ గట్ల వద్ద రైతులు మట్టి పోసేయడంతో మురుగునీరు చేలలోకి వచ్చేస్తోందని, తక్షణం చర్యలు చేపట్టి పంటచేలు మునిగిపోకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

డంపింగ్‌యార్డుకు స్థలం కేటాయించాలి

ఉండ్రాజవరం, జూలై 15: మండలంలోని తాడిపర్రు గ్రామానికి చెత్తవేయడానికి స్థలం కేటాయించాలని సర్పంచ్ కె.నరేంద్రబాబు సోమవారం తహశీల్దార్ కె.నవీన్‌కుమార్‌కు, ఎంపీడీవో జేడీవీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. డంపింగ్‌యార్డునకు స్థలం లేకపోవడంతో రోడ్డు పక్కనే వేయాల్సి వస్తుందని వివరించారు.

పారిశుధ్య నిర్వహణ మెరుగుపర్చాలి

» మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి
» కొవ్వూరులో పలు ప్రాంతాల పరిశీలన


కొవ్వూరు పోలీస్‌స్టేషన్ వద్ద పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న రత్నకుమారి

కొవ్వూరు, జూలై 15: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. సోమవారం కొవ్వూరులోని కోర్టు ప్రాంగణం, పట్టణ పోలీస్‌స్టేషన్, అగ్నిమాపకశాఖ కార్యాలయాలు, మెరకవీధి పెట్రోల్‌బంకు వద్ద వర్షపునీరు నిల్వ ఉన్న ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసఫ్, ఏఈలతో కలిసి ఆమె పరిశీలించారు. కోర్టు ప్రాంగణంలో వర్షపునీరు నిలిచిపోతుండడంతో కోర్టుకు వచ్చే కక్షిదారులు, పోలీస్‌స్టేషన్, ట్రెజరీ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు తెలియజేశారు. దీంతో చైర్‌పర్సన్ మాట్లాడుతూ కోర్టు వర్షపునీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకుంటామని, డ్రైను నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈలు దుర్గాకిషోర్, సుమంత్‌లను ఆదేశించారు. ఆంధ్రాబ్యాంకు వద్ద డ్రైనేజీలో పూడికను తొలగించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బావన రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.


గోపాలపురంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో రమేష్

మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలి

గోపాలపురం, జూలై 15: దోమలు అల్పజీవులే అయినా వాటి బారిన పడితే వచ్చే వ్యాధులు మాత్రం పెద్దవని ఎంపీడీవో కె.రమేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులతో ఆయన విడివిడిగా సోమవారం సమావేశం నిర్వహించారు. మంగళవారం దేవరపల్లిలోని కరుటూరి ఫంక్షన్ హాలులో నిర్వహించే సమీక్షా సమావేశానికి అధికారులు గ్రామస్థాయిలో గుర్తించిన సమస్యలతో కూడిన నివేదికను తీసుకురావాలన్నారు. సమావేశానికి గైర్హాజరైనా, గ్రామస్థాయిలోని సమస్య ప్రస్ఫుటంగా వివరించకపోయినా సహించేది లేదన్నారు. అలాగే ప్రతి గ్రామంలోనూ మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలని, డయేరియా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వాన్ని ఉపేక్షించేది లేదన్నారు. రేపు జరిగే సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హాజరవుతారన్నారు.

కబళించిన మృత్యువు

» వ్యాన్ ఢీకొని ఇద్దరి మృతి.. రెండు కుటుంబాల్లో విషాదం


ప్రమాద స్థలంలో పడి ఉన్న దుర్గారావు, వెంకటేష్ మృతదేహాలు



కుమార్తె, భార్యతో దుర్గారావు, భార్యతో వెంకటేశ్వరరావు(ఫైల్‌ఫొటోలు)

రాజానగరం/దివాన్‌చెరువు, జూలై 15: రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జి.యర్రంపాలెం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. రాజానగరం మండలం పాతతుంగపాడు గ్రామానికి గండి దుర్గారావు(32), కడియం మండలం దుళ్ల గ్రామానికి చెందిన జక్కం వెంకటేష్ (35) మోటార్‌సైకిల్‌పై దుళ్ల నుంచి పాతతుంగపాడు పయనమయ్యారు. మార్గమధ్యలో జి.యర్రంపాలెం సమీపానికి వచ్చే సరికి ఎదురుగా టాటాఏస్ వ్యాన్ వీరిని బలంగా ఢీకొని ఆపకుండా వెళ్లిపోయింది. స్థానికులు గమనించి వాహనాన్ని ఆపారు. కాగా దుర్గారావు అత్త వారి ఊరు దుళ్లలో ఉంటూ తాపీ పనిచేస్తున్నాడు. తుంగపాడులో అరటి తోట కౌలుకు తీసుకున్నాడు. అరటి గెలలు కోసేందుకు దుళ్ల నుంచి వెంకటేష్‌ను వెంట బెట్టుకుని వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కాగా దుర్గారావుకు ఓ కుమార్తె ఉండగా భార్య ప్రస్తుతం గర్భిణి. వెంకటేష్‌కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె. ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే పాతతుంగపాడుకు చెందిన పలువురు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను చూసిన చలించిపోయారు. ఈ మేరకు రాజానగరం ఎస్‌ఐ మనోహర్ కేసు నమోదు చేశారు. మృతదేహాలను శవ పరీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

దుళ్లలో విషాదఛాయలు

కడియం, జూలై 15: తుంగపాడులో జరిగిన ప్రమాదంలో దుళ్ల గ్రామానికి చెందిన జక్కం వెంకటేశ్వరరావు, గండి దుర్గారావు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరూ కూలిపనులు చేసుకుంటూ కుటుంబాల్ని పోషించుకునే వారే. వీరి మృతితో ఆ కుటుంబాలు ఆధారాన్ని కోల్పోయాయి. జక్కం వెంకటేశ్వరరావుకు భార్య విజయలక్ష్మి, ఇంటర్ పాసైన కుమార్తె లీలా నాగదివ్య, పదో తరగతి చదువుతున్న శశిధర్ ఉన్నారు. గండి దుర్గారావుకు భార్య నాగలక్ష్మి, ఒకటో తరగతి చదువుతున్న కుమార్తె సంధ్యాదేవి ఉన్నారు. ప్రస్తుతం దుర్గారావు భార్య నాగలక్ష్మి 6 నెలల గర్భిణి.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే నల్లమిల్లి

పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి వినతి

అనపర్తి, జూలై 15: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనపర్తిలోని ప్రభుత్వ పాలి టెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి కళాశాలకు అవసరమైన భూమిని సేకరించాలన్నారు. అలాగే వెలగపూడి సచివాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడిని కలిసి చాగల్నాడు, వెంకటనగర్ ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి తీసుకువస్తే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు. తదుపరి రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను, విజయవాడ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గుమ్మళ్ల సృజన, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన మహేష్‌చంద్ర లడ్హాలను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డ్వాక్రా సభ్యురాళ్లకు పాత గుర్తింపుకార్డులు

అడ్డుకున్న గోపాలపురం మాజీ ఎంపీటీసీ

ఉన్నతాధికారులకు ఫిర్యాదు



గోపాలపురంలో నవరత్నాల ఫొటోలతో ముద్రించిన గుర్తింపు కార్డులు పంపిణీ చేసిన వెలుగు సిబ్బంది

గోపాలపురం, జూలై 15: ప్రభుత్వాలు, పాలకులు మారిన క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరులో మార్పు రాలేదని మాజీ ఎంపీటీసీ కూనపం ప్రసాద్‌బాబు అన్నారు. గోపాలపురంలోని ఉప్పరగూడెంలో మహిళా సాధికార సంస్థలో పని చేస్తున్న సీఏ స్వయం సహాయక సంఘ సభ్యులకు సభ్యురాలి ఫొటో, వివరాలు, నవరత్నాల పథకాలతో పాటు మాజీ సీఎం జగన్ ఫొటోతో ముద్రించిన గుర్తింపుకార్డులను మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేస్తుంటే అడ్డుకున్నట్టు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండురోజులుగా ఇదే తంతు జరుగుతోందని తన దృష్టికి రావడంతో కార్డుల పంపిణీని అడ్డుకున్నామన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని తెలిపామన్నారు. దీనిపై డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్.మూర్తి, ఎంపీడీవో రమేష్‌ను వివరణ కోరగా స్వయం సహాయక సంఘాల మహిళలకు మహిళా సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎటువంటి గుర్తింపుకార్డుల పంపిణీకి అనుమతించలేదన్నారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేలా కార్డులు పంపిణీ చేసిన వ్యక్తులపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

18 నుంచి లెప్రసీపై ఇంటింటి సర్వే

» జిల్లా కలెక్టర్ ప్రశాంతి..
» జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ


కుష్ఠు నిర్మూలన కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15: జిల్లాను కుష్ఠు రహితంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ జిల్లాలో లెప్రసీ డిటెక్షన్ క్యాంపెయిన్ ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి వెల్లడించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ఇంటింటి సర్వే ద్వారా కుష్ఠువ్యాధి గుర్తింపు, ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపడతారన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కుష్ఠు సస్పెక్ట్ కేసుల సర్వే వియవంతం చేయాలన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారిణి డాక్టర్ ఎన్.వసుంధర, ఇన్‌ఛార్జి జేసీ దినేష్‌కుమార్, డీఆర్‌వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కేంద్రాల పనితీరు పర్యవేక్షణ

రాజమహేంద్రవరం రూరల్, జూలై 15: స్త్రీ సంక్షేమం, భద్రత, భరోసా, బాలిక విద్యపై దృష్టిసారించాలని, వర్చువల్ ద్వారా ఐసీడీఎస్ కేంద్రాల నిర్వహణ పనితీరును ప్రత్యక్షంగా పర్యవేక్షణ చేస్తానని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో స్త్రీ సంక్షేమ శాఖ సీడీపీవోలతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా స్త్రీ సంక్షేమం, ఆరోగ్య పరంగా, బాలిక విద్య, గర్భిణులకు ఖచ్చితమైన ఆరోగ్య సంరక్షణ వంటి వాటిపై ప్రత్యక్ష పర్యవేక్షణ ఉండాలన్నారు. బేటీ పడావో-బేటీ బచావో కార్యక్రమ ఉద్దేశ్యం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడమేనని స్పష్టం చేసారు. ఏ తల్లీ బలహీనంగా వున్న పిల్లలను కావాలని కోరుకోరని, ఆ మేరకు తల్లుల్లో అవగాహన కల్పిస్తే సంపూర్ణ ఆరోగ్యంతో పిల్లలు పుట్టే అవకాశం వుందన్నారు. బాల్య వివాహాలు అరికట్టాలన్నారు. త్వరలో క్షేత్ర స్థాయిలో అంగన్వాడీ కేంద్రాలను సందర్శనకు వస్తామన్నారు. ఆ సమయంలో ప్రీస్కూలు నిర్వహణ, హాజరుశాతం పరిశీలిస్తామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, జిల్లా పిల్లల సంరక్షణ అధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పిడింగొయ్యి పంచాయతీ తనిఖీ

రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యి పంచాయతీని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో పనిచేసే సిబ్బంది సంఖ్య, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై ఆరా తీశారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నియంత్రణ చర్యల్లో భాగంగా పంచాయతీల పరిధిలో పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. డ్రైనేజీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. కాగా డిజటల్ అసిస్టెంట్ వుండగా కంప్యూటర్ ఆపరేటర్ పనేంటి అని కార్యదర్శి రూప్‌చంద్‌ను ప్రశ్నించగా నీళ్లు నమలినట్టు తెలిసింది. ఏ గ్రామానికి చెందిన పంచాయతీ సిబ్బంది అంతా ఆ గ్రామ పంచాయతీ పరిధిలోనే పని చేసేలా చూడాలంటూ పంచాయతీ అధికారులను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు.

ఆన్‌లైన్‌లో దుష్ప్రచారం

ఇద్దరిపై కేసు నమోదు.. వీరిలో ఒకరు హెడ్ కానిస్టేబుల్

రాజమహేంద్రవరం, జూలై 15(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారనే ఫిర్యాదుతో ఇద్దరు వ్యక్తులపై ప్రకాశంనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సత్యనారాయణ తెలిపిన, ఎఫ్ఐఆర్‌లోని వివరాల ప్రకారం.. పోస్టల్ కాలనీకి చెందిన తురాల శ్రీనివాస్ యాదవ్ కుమార్తె శిరీషా యాదవ్‌కి ఈ ఏడాది మార్చి 20న 77299 48662 నంబరు నుంచి ఒక మేసేజ్ వెళ్లింది. దీనిపై విచారించగా గుత్తుల మురళీకృష్ణ, కోరుకొండ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వైరిచర్ల ఉదయ భాస్కర్ అదే మెసేజ్‌లు పోస్ట్ చేసినట్టు తెలిసింది. బాధితుడు శ్రీనివాస యాదవ్ ఎస్పీకి ఫిర్యాదు చేయగా ప్రాథమిక విచారణ అనంతరం ఆదివారం రాత్రి ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

ఎయిర్‌ఫోర్సు ఉద్యోగాలపై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 15: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, జేకేసీ ఆధ్వర్యంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్సు ఉద్యోగాలపై అవగాహన కల్పించారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్సుకు చెందిన ఎన్.సందీప్ బృందం పలు విషయాలు వివరించారు. అగ్నిపథ్‌ను ఎలా ఎదుర్కొనాలో, ప్రాథమిక పరీక్షకు ఎలా సిద్ధపడాలో ఉద్యోగార్హతలు, ఎంపికైన తర్వాత శిక్షణ వివరాలను తెలిపారు. విద్యార్థులు ఈ ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మల్లికార్జున తెలిపారు.

రైతుబజార్‌లో తూకం, నాణ్యతపై తనిఖీలు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 15: రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ విపణిలో ధరల నియంత్రణకు సబ్సిడీ పై అందిస్తున్న బియ్యం, కందిపప్పు తదితర నిత్యావసరాలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా వినియోగదారుల మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు, సుంకర వీరశేఖర్ అన్నారు. జిల్లా సివిల్ సప్లయి అధికారి ఆదేశాల మేరకు సోమవారం రాజమహేంద్రవరం రైతు బజార్లలో తూకం,నాణ్యతపై తనిఖీలు చేశారు.

కాలినడకన తిరుపతికి టీడీపీ నాయకులు

రంగంపేట, జూలై 15: సార్వత్రిక ఎన్నికల్లో అనపర్తి ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో మండలంలోని జి.దొంతమూరు టీడీపీ నాయకులు సింగన వెంకట సూర్యనారాయణ, బిల్లకుర్తి భాస్కరారవు, గల్లా సుబ్రహ్మణ్యం తిరుపతి వేంకటేశ్వరస్వామికి మొక్కు తీర్చుకోవడానికి సోమవారం కాలినడకన బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, జటప్రోలు వెంకటేశ్వరరావు, దుప్పలపూడి రాజేష్, ఉప సర్పంచ మెత్తన లోవకుమారి పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు
యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్1: కల్కి
వై.స్ర్కీన్2 : మహారాజ
దేవిశ్రీ(గాయత్రి) : హరోంహర
అనన్య : తమ్ముడు

నిడదవోలు
వీ మ్యాక్స్ : ---
రాధాకృష్ణ : కల్కి
శ్రీగణపతి : భారతీయుడు-2

దేవరపల్లి
శ్రీరామ్ సినీ మ్యాక్స్ : కల్కి
శ్రీరామ్ సినీ మ్యాక్స్ : కల్కి

నల్లజర్ల
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్ర్కీన్1 : భారతీయుడు-2
స్ర్కీన్ 2 : కల్కి
శ్రీనివాస : ---